@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TS-27-0016491

# మీ వార్త
తెలుగు డిజిటల్ దినపత్రిక

హైదరాబాద్
బుధవారం 19 ఫిబ్రవరి 2025

సంపుటి : 2
సంచిక : 268
పేజీలు : 8 వెల : 5/-




తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

# కాంగ్రెస్ ప్రచారం చేసుకోలేకపోతోందా?



కేసీఆర్‌పాలనను మరపించేలా పాలన సాగించాలని లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్

గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టి

ఇందులో భాగంగా పలు హామీలను అమలు చేసింది

వాస్తవానికి రుణమాఫీ, కొత్త రేషన్‌కార్డుల జారీతో మంచి మైలేజీ వస్తుందని హస్తం నేతలు భావించారు.

కానీ, ప్రచారంలో పార్టీ నేతలే వెనుకబడుతున్నారు

అంతర్గత కుమ్ములాటలు, అలకల కారణంగా చేసిన పని చెప్పుకోలేకపోతున్నామని హస్తం నేతల భావన



2

తెలంగాణలో దశాబ్దం తర్వాత అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ.. కేసీఆర్‌పాలనను మరపించేలా పాలన సాగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈమేరకు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. అయితే ఇంకా చాలా హామీలు మిగిలే ఉన్నాయి. అమలు చేసినవాటికన్నా పెండింగ్‌లో ఉన్నవే ఎక్కువగా ఉన్నాయి. దీంతో హస్తం పార్టీకి ఆశించిన మైలేజీ రావడం లేదు. వాస్తవానికి రుణమాఫీ, కొత్త రేషన్‌కార్డుల జారీతో మంచి మైలేజీ వస్తుందని హస్తం నేతలు భావించారు.

# సైబర్ సేఫ్టీలో తెలంగాణ ముందుండాలి



- షీల్డ్ 2025 ప్రారంభోత్సవంలో సీఎం
- సైబర్ సేఫ్టీలో మన రాష్ట్రాన్ని నంబర్ వన్ గా నిలపడమే మా ప్రభుత్వం లక్ష్యం
- దేశంలో సైబర్ నేరగాళ్లు గత ఏడాది రూ. 22,812 కోట్లు దోచుకున్నారని ఒక అంచనా
- ఇది మన ఆర్థిక వ్యవస్థకు, మన పౌరులకు ముప్పు. ఈరోజుల్లో ఫేక్ న్యూస్ అనేది మరో ప్రధానమైన ముప్పు.
- సైబర్ క్రైం ను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉంది

హైదరాబాద్

దేశంలోనే సైబర్ సేఫ్టీలో మన రాష్ట్రాన్ని నంబర్ వన్ గా నిలపడమే మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ సేఫ్టీ, ఫ్యూచర్ గురించి చర్చించేందుకు ఇవాళ షీల్డ్ 2025ని నిర్వహించుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన షీల్డ్-2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో అయన మాట్లాడారు. మొదటిసారి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ను అభినందిస్తున్నా. తెలంగాణను నంబర్ వన్ సైబర్-సేఫ్ స్టేట్గా మార్చడానికి కలిసి పనిచేస్తున్న మీ అందరినీ ఇక్కడ కలుసుకోవడం సంతోషంగా ఉంది. దేశంలో సైబర్ నేరగాళ్లు గత ఏడాది రూ. 22,812 కోట్లు దోచుకున్నారని ఒక అంచనా. ఇది మన - మిగతా3లో



## అర్ధరాత్రి నిర్ణయం సరికాదు

- సీఈసీ ఎంపికపై విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హెూం మంత్రి అమిత్‌షా అర్ధరాత్రి వేళ నిర్ణయం తీసుకోవడం అగౌరవప్రదమైన చర్య
- కార్యనిర్వాహక వర్గం జోక్యం లేని స్వతంత్ర ఎలక్షన్ కమిషన్‌లో ఎన్నికల సంఘం కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషన్‌ను ఎంపిక చేసే ప్రక్రియ కీలకం.

# రేవంత్‌వి దొంగ మాటలు

- సీఎం రేవంత్ ఏ ఒక్క హామీనైనా అమలు చేశారా
- రేవంత్‌కు రియల్ఎస్టేట్ తప్ప స్టేట్ గురించి పట్టదు...
- 12 కాలాల పాటు 73 వేల కోట్లు రైతుల అకౌంట్‌లలో వేసిన ఘనుడు కేసీఆర్
- ఇప్పుడు రేవంత్ దొంగ మాటలు.. మోసం మాటలు చెప్పి మొండి చెయ్యి చూపారు
- బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేశారు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో 430 మంది రైతులు రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.



రంగారెడ్డి/ మహబూబ్‌నగర్

తొందరలోనే స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉపఎన్నిక రాబోతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు. మంగళవారం ఆమన్‌గల్‌లో బీఆర్ఎస్ నేతృత్వంలో రైతు మహాధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. రేవంత్ రెడ్డి కొండగల్‌కు వలసపోయారంటూ వ్యాఖ్యలు చేశారు. "రేవంత్ రెడ్డి అత్తగారి ఊరికి వచ్చినా... వారికి ఏమైనా చేశారా అని చూద్దాం అని వచ్చిన" అని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లో రైతు రారాజుగా ఉండేవాడని తెలిపారు. ఎవ్వరూ అప్పు అడిగే పరిస్థితి లేకుండే అని.. ప్రతీ సీజన్‌లో టింగ్ టింగ్‌మని రైతు బంధు పడేద న్నారు. కానీ.. రేవంత్ టింగ్ టింగ్ అనకుండా టకి టకీ పడతాయి అని అన్నారు కానీ ఎవ్వరికీ పడలేదని విమర్శించారు. - మిగతా3లో


# మహా కుంభ్‌కాదు.. మృత్యుకుంభ్'



- సీఎం మమతా బెనర్జీ వివాదాస్పద వ్యాఖ్యలు
- 'కుంభమేళాకు వెళ్లి భక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు
- యూపీ సర్కార్ వీఐపీల కోసమే ఏర్పాట్లు చేసింది
- సామాన్యుల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు
- నేను మహా కుంభమేళాను గంగామాతకు గౌరవ సూచికంగా భావిస్తున్నాను

# ఎస్సీ వర్గీకరణ అంశం... ఏకసభ్య కమిషన్ కాలపరిమితి పొడిగింపు

- ఎస్సీ వర్గీకరణ అంశంపై జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో కమిషన్
- షమీమ్ అక్తర్ కాలపరిమితిని మార్చి 10 వరకు పొడిగించిన ప్రభుత్వం
- గతంలో ఒకసారి గడువు పొడిగించిన ప్రభుత్వం



# అక్రమ వలసదారులను ఎలా గుర్తిస్తారంటే

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులను ఆ దేశం నుంచి పంపిస్తున్నారు. ఇందుకోసం దేశమంతా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వందల మందిని తరలించారు. ఇటీవలే 312 మందితో భారత్‌కు కూడా ఓ విమానం వచ్చింది. ఇందులో గుజరాత్, హరియాణా, పంజాబ్‌లకు చెందిన అక్రమ వలసదారులు ఉన్నారు. వారంతా స్వదేశానికి వచ్చారు. అమెరికా ఎవరిని బహిష్కరిస్తుంది.. మళ్లీ వారు అక్కడకు వెళ్లొచ్చా అన్న సందేహాలు కూడా కలుగుతున్నాయి. అమెరికా నుంచి ఎవరిని బహిష్కరిస్తున్నారనే వివరాలను మైగ్రేషన్ పాలసీ రిపోర్టు కొన్ని వివరాలు వెల్లడించింది. అనధికారికంగా ఉంటున్నవారినే బహిష్కరిస్తారని చాలా మంది భావిస్తున్నారు. అయితే దేశంలో చట్టబద్ధంగా నివసిస్తూ సిటిజన్‌షిప్ పొందని వలసదారులు కూడా కొన్ని పరిస్థితుల్లో బహిష్కరణకు గురికావొచ్చు. అనధికారిక వలసదారులు, అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించిన వారు, వీసా గడువు ముగిసినా దేశంలో ఉంటున్నవారిని వారి దేశాలకు పంపించవచ్చు. తాత్కాలిక వీసాపై అమెరికాకు వెళ్లి అక్కడే నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్నవారిని కూడా బహిష్కరిస్తుంది. అక్రమ వలసదారులే కాకుండా అమెరికాలోని గ్రీన్‌కార్డు హోల్డర్లు, తాత్కాలిక వీసా హోల్డర్లు కూడా బహిష్కరణకు గురికావొచ్చు. అయితే ఈ కోవలోకి వచ్చే వక్తులు నేరాలకు పాల్పడినట్లు నిరూపణ కావాలి. ఈ నేరాలలో తాగి వాహనం నడపడం, అనుమతి లేకుండా ఆయుధాలతో దొరికిపోవడం, డ్రగ్స్ తీసుకోవడం, తిరగడం, హింసాత్మక నేరాలకు పాల్పడడం వంటివి ఉన్నాయిఅనైతిక చర్యలతో కూడిన నేరానికి పాల్పడిన వ్యక్తిని బహిష్కరించడానికి రెండు మార్గాలు ఉన్నాయి. మొదటిది అమెరికాలో నివసించిన మొదటి ఐదేళ్లలో అనైతికంగా భావించే నేరానికి పాల్పడడం, రెండోది వేర్వేరు కేసుల్లో రెండు లేదా అంతకన్నా ఎక్కువ అనైతిక నేరాలకు పాల్పడడం, రెండోదానికి కాలపరిమితి లేదు. అయితే అనైతిక చర్యలతో కూడిన నేరం అంటే ఏమిటో స్పష్టమైన నిర్వచనం లేదు. ఈ విషయంపై అమెరికా కోర్టులు ఎప్పటికప్పుడు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నాయి. వీటిలో మోసం, వ్యక్తులు లేదా ఆస్తికి హాని కలిగించే ఉద్దేశం, మరణ లేదా దోపిడీకి కారణమయ్యే వారు, భార్యాభర్తల మధ్య హింస మొదలైనవి. అమెరికా ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్వో) అధికారులు ఆ దేశంలో వలస చట్టాలను అమలు చేసే పనిలో ఉంటారు. ఈ అధికారులు నేషనల్ సెక్యూరిటీ వ్యవహారాలు చూస్తుంటారు. ఇమిగ్రేషన్ అమలు ప్రక్రియ అన్ని దశలను ఈఆర్వో నిర్వహిస్తుంది. ఇమిగ్రేషన్ అమలు ప్రక్రియ అన్ని దశలను ఈఆర్వో నిర్వహిస్తుంది. బహిష్కరణకు అర్హత ఉన్నవారి గుర్తింపు, అరెస్టు, నిర్బంధం, వారి దేశాలకు పంపిచే ప్రక్రియ తదితరాలు ఉంటాయి. ఇక బహిష్కరణకు అర్హులైన వ్యక్తులను గుర్తించడానికి లక్ష్య(టార్గెటెడ్), గూఢచార కార్యకలాపాలను ఈఆర్వో నిర్వహిస్తుంది. క్రిమినల్ అరెస్ట్ వారెంట్‌లను




అమలుఏయడం, బహిష్కరణకు అర్హత ఉన్న వ్యక్తుల అరెస్టులతోపాటు ఇమ్మిగ్రేషన్ సంబంధిత క్రిమినల్ చర్యల కోసం ప్రాజిక్యూషన్ ప్రారంభించే అధికారం ఈఆర్వోకు ఉంది. ఈఆర్వో విభాగం అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ప్రధానంగాఎండు వర్గాలుగా విభజిస్తారు. ఒకటి అమెరికా పౌరసత్వం ఉన్నవారు, రెండోది అమెరికాలో వారి నేర చరిత్ర ఆధారంగా నిర్ణయిస్తారు..


**అమెరికాలో అమ్మకానికి ఇళ్లు**
**90 రోజుల్లో 1200 ఇళ్లు**

అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. జనవరి 20న ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే ఆయన ఎన్నికల హామీలు నెరవేర్చడంపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలోనే మేక్ అమెరికా గ్రేట్ ఎగ్రై న్ నినాదంతో ముందుకు వెళ్తున్నారు. ట్రంప్ నిర్ణయాలతో ప్రపంచ దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. ప్రధానంగా అక్రమ వలసదారులను ఖైదీల్లా స్వదేశాలకు పంపుతున్నారు. జన్మతః సిటిజన్‌షిప్ రద్దు చేశారు. మరోవైపు కెనడా, మెక్సికో, చైనా దిగుమతులపై 25 శాతం సుంకాలు విధించారు. స్టీల్, అల్యూమినియం దిగుమతిపైనా భారీగా పన్ను విధించారు. ట్రంప్ నిర్ణయాలతో ప్రపంచదేశాలతోపాటు అమెరికాలో ఉంటున్న విదేశీయులు ఇబ్బంది పడుతున్నారు. ఆ దేశ ప్రజలు కూడా భయపడుతున్నారు. దీంతో వాషింగ్‌టన్ డీసీలో రియల్ ఎస్టేట్ మార్కెట్ పతనం అవుతోంది. దీంతో వేల ఇళ్లను అమ్మకానికి ఉంచారు. అమెరికా రాజధాని వాషింగ్‌టన్ డీసీలో 14 రోజుల్లో 4,271 కన్నా ఎక్కువ ఇళ్లను అమ్మకానికి ఉంచారు. ఈవిషయాన్ని ఒక ఎక్స్ యూజర్ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఎలుకలు పారిపోతున్నాయి. అని కాప్షన్ ఇచ్చాడు. నగరవాసులు తమ వసుత్వులు సర్దుకుని సామూహికంగా నగరం విడిచి వెళ్లిపోతున్నారని తెలిపారు. ఈ వలసలకు కారణం ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ అని స్థానికులు చెబుతున్నారు. నగరంలో, చుట్టుపక్కలక అమ్మకానికి ఉన్న 14,825 ఇళ్లను చూపించే ఫొటోలు కూడా సోషల్ మీడియాలో షేర్‌చేశారు. నగరంలో 500లకుపైగా ఇళ్లు, రూ.8 కోట్లకన్నా ఎక్కువ ధరకు అమ్మకానికి ఉన్నాయి వెల్లడించారు. అమెరికన్లను సురక్షితంగా ఉంచే విధానాలపై పనిచేసే థింక్ ట్యాంక్ అయిన సెంటర్ ఫర్ సెక్యూరిటీ పాలసీలో పనిచేస్తున్న సీనియర్ విశ్లేషకుడు తెలిపారు. ఆన్‌లైన్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్లేస్ అయిన జిల్లోలో అమ్మకానికి ఉన్న ఇళ్ల జాబితాను మరో ఎక్క్ యూజర్ షేర్ చేశాడు. ఏడు రోజుల్లో 201, 14 రోజుల్ల 378, 30 రోజుల్లో 706, 90 రోజుల్లో 1,198 కొత్త ఇళ్లు అమ్మకానికి వచ్చినట్లు వివరించాడు. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలను కూడా ఎక్స్‌లో పోస్టు చేశాడు. అక్రమ వలసదారులను తరలిస్తుండడంతో వారంతా అప్పటికే కొనుగోలు చేసిన ఇళ్లను అమ్మకానికి పెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో ఇళ్ల అమ్మకాలు పెరుగుతున్నాయి.

# ఆసియాను శాసిస్తున్న ఇండియన్ బిలీయనీర్స్













**న్యూఢిల్లీ :** ఆసియాలోని సంపద చార్టులలో భారతీయులు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ కొన్నేళ్లుగా అగ్రస్థానంలో ఉంటున్నారు. తాజాగా ఈ జాబితాలో పలు భారతీ కుటుంబాలు కూడా చేరాయి. ప్రపంచంలో అత్యంత ధనవంతుడు టెస్లా, స్పేస్ ఎక్, ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్, ప్రస్తుతం డోస్ చైర్‌పర్సన్‌గా కూడా ఉన్నారు. ఆయనతో అనేక మంది పోటీ పడుతున్నారు. కానీ, రెండేమూడేళ్లుగా మస్కే అగ్రస్థానంలో ఉంటున్నారు. ఇక ఆసియా ధనవంతుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ టాప్ వన్‌లో ఉన్నారు. ఆయనతో అనేక మంది పోటీ పడుతున్నా.. అగ్రస్థానంలో అంబానీ కుటుంబమే ఉంది. తాజాగా బ్లూమ్‌బెర్గ్ ఆసియాలో అత్యంత సంపన్నులైన 20 జాబితా విడుదల చేసింది. ఇందులో ఆరుగురు భారతీయులు ఉన్నారుఅంబానీ కుటుంబం 90.5 బిలియన్ డాలర్ల సంపదతో బ్లూమ్‌బెర్గ్ చార్టులలో అగ్రస్థానంలో ఉంది. ఈ కుటుంబానికి చెందిన ప్రధాన సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్. దివంగత పారిశ్రామికవేత్త ధీరూభాయ్ అంబానీ కుమారుడు ముఖేష్ అంబానీ నేతృత్వంలో ఈ సంస్థ ఉంది. అతని నివాసం, 27 అంతస్తుల భవనం, ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఖరీదైన ప్రైవేట్ నివాసంగా పిలువబడుతుంది. జాబితాలో రెండోస్థానంలో థాయిలాండ్‌లోని చీరవనాంట్ కుటుంబం, మొత్తం సంపద 42.6 బిలియన్ డాలర్లు. ఇది అంబానీల సంపదలో సగం కంటే తక్కువ. ఈ కుటుంబం ఆహారం, రిటైల్ మరియు టెలికాం యూనిట్లను నిర్వహించే చారోయెన్ పోక్‌ఫాండ్ గ్రూప్‌ను కలిగి ఉంది. బ్యాంక్ సెంట్రల్ ఆసియాతో వారి విజయం, పొగాకు వ్యాపారంతో వారి ప్రారంభం కారణంగా ఇండోనేషియాకు చెందిన హార్టోనో కుటుంబం 42.2 బిలియన్ల డాలర్ల సంపదతో తదుపరి స్థానంలో ఉంది. జాబితాలో నాల్గవ స్థానంలో భారతదేశానికి చెందిన మిస్త్రీ కుటుంబం ఉంది, ఈ కుటుంబం సంపద 37.5 బిలియన్ల డాలర్లు. ఈ కుటుంబానికి చెందిన షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ ఇంజనీరింగ్ నిర్మాణంతో సహా బహుళ రంగాలలో పనిచేస్తుంది. భారతదేశంలోని అతిపెద్ద సమ్మేళన సంస్థలలో ఒకటైన టాటా గ్రూప్‌లో ఈ కుటుంబం గణనీయమైన వాటాను కలిగి ఉంది. ఐదవ స్థానంలో హాంకాంగ్‌లోని అతిపెద్ద రియల్ ఎస్టేట్ డెవలపర్‌లలో ఒకటైన సన్ హంగ్ కై ప్రాపర్టీస్‌ను కలిగి ఉన్న హాంకాంగ్‌కు చెందిన క్వాక్ కుటుంబం ఉంది. ఈ కుటుంబ సంపద 35.6 బిలియన్ల డాలర్లుతైవాన్‌కు చెందిన త్సాయ్ కుటుంబం 30.9 బిలియన్ల డాలర్లతో ఆరవ స్థానంలో ఉంది. ఈ కుటుంబ సంపద ప్రధానంగా కాథే లైఫ్ ఇన్సూరెన్స్ మరియు ఫుబన్ ఇన్సూరెన్స్ నుండి వచ్చింది, అదే సమయంలో రియల్ ఎస్టేట్ మరియు టెలికాం వంటి ఇతర రంగాలలోకి కూడా విస్తరించింది. భారతదేశానికి చెందిన జిందాల్ కుటుంబం 28.1 బిలియన్ల డాలర్ల నికర విలువతో ఏడవ స్థానంలో ఉంది. ఇది ఉక్కు, శక్తి, సిమెంట్ మరియు క్రీడలు వంటి రంగాలలో వ్యాపార ప్రయోజనాలను కలిగి ఉన్న ప్రసిద్ధ ??క జిందాల్ గ్రూప్‌ను కలిగి ఉంది. థాయ్‌లాండ్‌కు చెందిన యూవిధ్య కుటుంబం ఎనిమిదో స్థానంలో నిలిచింది, వీరికి టీసీపీ గ్రూప్ ఉంది. వీరి సంపద 25.7 బిలియన్ల డాలర్లు. ఈ గ్రూప్ రెడ్ బుల్ అనే ఎనర్జీ డ్రింక్‌ను ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ చేస్తుంది. బిర్లా కుటుంబం జాబితాలో తొమ్మిదవ స్థానంలో ఉంది. 23.0 బిలియన్ల డాలర్ల నికర విలువతో, ఆదిత్య బిర్లా గ్రూప్ ఆర్థిక సేవలు, మెటల్ మరియు రిటైల్ వంటి పరిశ్రమలలో ఆసక్తిని కలిగి ఉంది. శామ్‌సంగ్‌ను నడుపుతున్న దక్షిణ కొరియాకు చెందిన లీ కుటుంబం 22.7 బిలియన్ల డాలర్ల సంపదతో జాబితాలో పదవ స్థానంలో నిలిచింది. అలాగే, బజాజ్, హిందూజా కుటుంబాలు వరుసగా 20.1 బిలియన్లు 15.2 బిలియన్ల డాలర్ల నికర విలువతో ప్రపంచ వ్యాపార వేదికపై భారతదేశం ప్రభావాన్ని ప్రదర్శిస్తూ టాప్ 20లో ఉన్నాయి.

# సీఎంతో విభేదాలపై ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు



**ముంబై:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు, ఆయన డిప్యూటీ ఏక్‌నాథ్ షిండేకు మధ్య 'ప్రచ్ఛన్న యుద్ధం' జరుగుతోందా? 20 మంది శివసేన వర్గం ఎమ్మెల్యేల భద్రతను 'వై ప్లస్' క్యాటగిరికి తగ్గించడం, రాయ్‌గఢ్, నాసిక్‌లకు ఇన్‌చార్జుల నియామకంపై షిండే శివసేన అభ్యంతరం తెలవడం వంటి వరుస పరిణామాల నేపథ్యంలో ఇద్దరి మధ్యా వ్యవహారం చెడిందనే ఊహాగానాలు ఉపందుకుంటున్నాయి. దీనిపై ఏక్‌నాథ్ షిండే ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. సీఎం, డిప్యూటీ సీఎం మధ్య "కోల్డ్ వార్" నడుస్తున్నట్టు మీడియాలో వస్తున్న వార్తలపై షిండే స్పందిస్తూ, తమ మధ్య ఎలాంటి "కోల్డ్ వార్" లేదన్నారు. "థండా థండా కూల్ కూల్" అని నవ్వుతూ సమాధానమిచ్చారు. "ఎలాంటి కోల్డ్ వార్ లేదు. మాదేమీ మహా వికాస్ అఘాడి (విపక్ష కూటమి) కాదు, ఇండి కూటమి కాదు. రాష్ట్ర ప్రగతి కోసం మేము సమష్టిగా పనిచేస్తున్నాం" అని ఏక్‌నాథ్ షిండే వివరణ ఇచ్చారు.

20 మంది ఎమ్మెల్యేల భద్రత కుదింపు

సీఎం ఫడ్నవిస్ నేతృత్వంలో రాష్ట్ర హోం శాఖ ఇటీవల శివసేనకు చెందిన 20 మంది అధికార ఎమ్మెల్యేల 'వై' కేటగిరి భద్రతను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. బీజేపీ, ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యేల భద్రతను కూడా తగ్గించనుంది. అయితే షిండే వర్గంతో పోలిస్తే ఈ సంఖ్య చాలా తక్కువనే చెప్పాలి.

## మహా కుంభ్‌కాదు.. మృత్యుకుంభ్






**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సంగమం 'మహాకుంభ మేళా'ను మహా కుంభ్ కాదు.. మృత్యుకుంభ్ అని వ్యాఖ్యానించారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఇవాళ అసెంబ్లీలో మమతా బెనర్జీ కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటపై స్పందించారు. 'కుంభమేళాకు వెళ్లి భక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు.. యూపీ సర్కార్ వీఐపీల కోసమే ఏర్పాట్లు చేసింది. సామాన్యుల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. నేను మహా కుంభమేళాను గంగామాతకు గౌరవ సూచికంగా భావిస్తున్నాను. కానీ పేదలకు కనీస సదుపాయాలు లేవు. వీఐపీల కోసం మాత్రమే ఏర్పాట్లు చేశారు. తొక్కిసలాటలో మరణించిన బాధిత కుటుంబాలకు ఇప్పటి వరకు ఎలాంటి ఎక్స్‌గ్రేషియా అందలేదు. పోస్ట్‌మార్టం చేయకుండా మృతదేహాల్ని వారి కుటుంబాలకు అప్పగించారు. పోస్టుమార్టం చేసి, డెత్ సర్టిఫికెట్ జారీ చేస్తేనే కదా ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా అందేది. బాధిత కుటుంబాలు ఇప్పుడు ఎక్స్ గ్రేషియా ఎలా పొందుతారు' అని ప్రశ్నించారు. కాగా, ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 ప్రారంభమైన మహాకుంభ మేళా 45 రోజులపాటు అంటే ఫిబ్రవరి 26వరకు కొనసాగనుంది.

## అర్ధరాత్రి నిర్ణయం సరికాదు



**న్యూఢిల్లీ:** భారత ప్రధాన ఎన్నికల కమిషన్‌గాజ్ఞానేశ్ కుమార్ ఎంపికైన కొద్ది గంటలకే ఎంపిక కమిటీలో సభ్యుడైన విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. సీఈసీ ఎంపికపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరుగుతుండగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా అర్ధరాత్రి వేళ నిర్ణయం తీసుకోవడం అగౌరవప్రదమైన చర్య అవుతుందన్నారు. సామాజిక మాధ్యమం "ఎక్స్" వేదికగా రాహుల్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. "సీఈసీ ఎంపిక కమిటీ సమావేశంలో మోదీ, అమిత్‌షాకు అభ్యంతరాల నివేదకను అందజేశాను. కార్యనిర్వాహక వర్గం జోక్యం లేని స్వతంత్ర ఎలక్షన్ కమిషన్‌లో ఎన్నికల సంఘం కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషన్‌ను ఎంపిక చేసే ప్రక్రియ కీలకం. ఎంపిక కమిటీ నుంచి సీజేఐను తొలగించడం ద్వారా మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించింది. ఇది ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై లక్షలాది మంది ఓటర్ల ఆందోళనకు కారణమవుతోంది" అని రాహుల్ అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, జాతి నిర్మాతల సిద్ధాంతాలకు కట్టుబడటం, ప్రభుత్వాన్ని జవాబుదారీని చేయాల్సిన బాధ్యత ఒక ప్రతిపక్ష నేతగా తనకు ఉందని రాహుల్ చెప్పారు. కమిటీ కూర్పు, ప్రక్రియను సుప్రీంకోర్టులో సవాలు చేస్తూ వేసిన పిటిషన్‌పై మరో 48 గంటల్లోనే విచారణ జరగాల్సి ఉండగా రాత్రికి రాత్రి ప్రధాని, హోం మంత్రి నిర్ణయం తీసుకోవడం సరికాదని అన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ సైతం సోమవారంనాడు ఇదే రకమైన డిమాండ్ చేసింది. సీఈసీ ఎంపిక ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ఈనెల 19న తుది తీర్పు రానుందనీ, అంతవరకూ సీఈసీ నియామక ప్రక్రియను వాయిదా వేయాలని ఆ పార్టీ కోరింది. అయితే, యథాప్రకారం భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా జ్ఞానేష్ కుమార్, ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి పేర్లను త్రిసభ్య కమిటీ ఖరారు చేసింది. ఆ పేర్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కమిటీ పంపగా ఆమె వెంటనే ఆమోదించారు

## ఢిల్లీ సీఎం ప్రమాణానికి కేజ్రీవాల్‌కు ఆహ్వానం



**న్యూఢిల్లీ:** దేశరాజధాని ఢిల్లీలో నూతన ప్రభుత్వం ఏర్పాటుకు బీజేపీ జోరుగా సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ నేత కేజ్రీవాల్‌ను సీఎం ప్రమాణ స్వీకార మహోత్సవానికి పిలుస్తారా లేదా అనే ప్రశ్న చాలామంది మదిలో మెదులుతోంది. ఇప్పుడు దీనికి సమాధానం దొరికింది. బీజేపీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం ఆమ్ ఆద్మీ పార్టీ సమన్వయకర్త, మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను, మరో మాజీ ముఖ్యమంత్రి ఆతిశీని ఈ కార్యక్రమానికి ఆహ్వానించనున్నారు. నూతన సీఎం ప్రమాణస్వీకారోత్సవానికి ఢిల్లీలోని లక్షమంది చోటామోటా నేతలను బీజేపీ ఆహ్వానించనుందని తెలుస్తోంది. అయితే కొత్త సీఎం ఎవరనేది బీజేపీ అధిష్టానం ఇంకా ప్రకటించలేదు. అయినప్పటికీ ప్రమాణస్వీకారానికి సన్నాహాలు ముమ్మరమయ్యాయి. బీజేపీ నేతలు వినోద్ తావ్డే, తరుణ్ చుగ్, వీరేంద్ర సచ్‌దేవ్ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులను ప్రత్యేకంగా ఆహ్వానించనున్నారు. ఫిబ్రవరి 19న జరగబోయే బీజేపీ ఎమ్మెల్యేల సమావేశంలో ఢిల్లీ సీఎంగా ఎవరిని ఎంపిక చేయనున్నారనేది వెల్లడికానుంది. తొలుత ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 19న నిర్వహించాలని బీజేపీ అధిష్టానం భావించింది. తరువాత ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 20న నిర్వహించాలని నిశ్చయించారు. ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి పేరుపై తుది నిర్ణయం తీసుకునేందుకు బీజేపీ కేంద్ర పరిశీలకులను నియమించనున్నదని సమాచారం. ఈ పరిశీలకులు ఢిల్లీ అసెంబ్లీ ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తారు. వీటి ఆధారంగా పార్టీ ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి పేరును ప్రకటిస్తుంది. కాగా ముఖ్యమంత్రి రేసులో న్యూఢిల్లీ ఎమ్మెల్యే ప్రవేశ్ వర్మ, ఢిల్లీ బీజేపీ మాజీ అధ్యక్షుడు విజేందర్ గుప్తా, రేఖ గుప్తా, సతీష్ ఉపాధ్యాయ్ పేర్లు ముందు వరుసలో ఉన్నాయని తెలుస్తోంది.

# కాంగ్రెస్ ప్రచారం చేసుకోలేకపోతోందా?

**హైదరాబాద్ :** తెలంగాణలో దశాబ్దం తర్వాత అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ.. కేసీఆర్‌పాలనను మరపించేలా పాలన సాగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈమేరకు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. అయితే ఇంకా చాలా హామీలు మిగిలే ఉన్నాయి. అమలు చేసినవాటికన్నా పెండింగ్‌లో ఉన్నవే ఎక్కువగా ఉన్నాయి. దీంతో హస్తం పార్టీకి ఆశించిన మైలేజీ రావడం లేదు. వాస్తవానికి రుణమా ఫీ, కొత్త రేషన్‌కార్డుల జారీతో మంచి మైలేజీ వస్తుందని హస్తం నేతలు భావించారు. కానీ, ప్రచారంలో పార్టీ నేతలే వెనుకబడుతున్నారు. అంతర్గత కుమ్ములాటలు, అలకల కారణంగా చేసిన పని చెప్పుకోలేకపోతున్నామని హస్తం నేతలు భావిస్తున్నారు. కలిసి కట్టుగా ప్రభుత్వ చేసే పనులను ప్రజలకు చెప్పాలని పెద్దలు కోరుతున్నారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇదే పనిచేస్తున్నారు. అయినా పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో నేతలు విఫలం అవుతున్నారు.మరోవైపు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్‌పై విపక్షాలు బలంగా వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ అనేక వియాల్లో కాంగ్రెస్ పాలనను తప్పు పడుతున్నాయి. హామీలు అమలు చేయలేదని ఎత్తి చూపుతున్నాయి.సీఎంఢిల్లీ నెలనెలా ఢిల్లీకి వెళ్లడాన్ని హైలెట్ చేస్తున్నాయి. సోషల్ మీడియా ప్రభావంతో ప్రజలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదన్న భావనలోనే ఉంటున్నారు. ప్రతిపక్షాల సోషల్ ప్రచారాన్ని తిప్పి కొట్టడంలో హస్తం పార్టీ సోషల్ మీడియా విఫలమవుతోంది. మరోవైపు పథకాలను కూడా సోషల్ మీడియా వేదికగా పెద్దగా ప్రచారం చేసుకోవడం లేదు. మంచైనా, చెడైనా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే క్షేత్రస్థాయికిచేరుతుంది. దీనిని గుర్తించిన బీఆర్ఎస్ కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. బలంగా గ్రౌండ్ లెవల్‌కు తీసుకెళ్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో కొన్ని మంచి పనులు చేసింది. మహిళలకు ఫ్రీ బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ. ఇందులో ఫ్రీ బస్సు, రైతు రుణమాఫీ గేమ్ చేంజర్ పథకాలు. కానీ, వీటిని హస్తం నేతలు ప్రచారం చేసుకోవడం లో విఫలమయ్యారు. దీనికి ప్రధాన కారణం నాయకత్వ లోపం, వ్యూహాత్మక తప్పిదం. ఉచిత ప్రయాణంతో నెలకు సుమారు రూ.3 కోట్ల రూపాయలు మహిళలకు మిగులుతున్నాయి. దీనిని ప్రచారం చేసుకోవడం లేదు. క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం లేదు. ఇక రుణమాఫీతో రైతులకు లక్షల మంది రైతులకు కోట్ల రూపాయల లబ్ధి కలిగింది. కానీ దీనిని కూడా సరిగా ప్రచారం చేసుకోలేకపోయింది. రూ.500 సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కారణంగా కూడా పేద, మధ్య తరగతి ప్రజలకు భారీగా లబ్ధి కలుగుతోంది. దీనిని లెక్కలతో సహా వివరించడంలో పాలకులు విఫలమవు తున్నారు. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీ వెనుకబడిపోయింది. ఇదిలా ఉంటే టీపీసీసీ రాష్ట్రంలో క్యాడర్‌ను యాక్టివ్ చేయడంలో విఫలమవుతోంది. బీఆర్ఎస్ ఏ కార్యక్రమం చేసిన క్షేత్రస్థాయిలో సంబురాలు నిర్వహించేది. ఇప్పటికీ ప్రతిపక్షంగా కూడా అదే చేస్తోంది. కానీ, కాంగ్రెస్ పార్టీ ఈ మేరకు కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ఎమ్మెల్యేలు, టీపీసీసీ కూడా ఈమేరకు యాక్టివ్ చేయడం లేదు. పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యం కూడా క్యాడర్‌లో నిస్తేజానికి కారణం. మరోవైపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం కారణంగా కూడా కేడర్ యాక్టివ్‌గా లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా టీపీసీసీ చీఫ్, సీఎం మైలేజీ రావడంలో ఎక్కడ లోపం జరుగుతుందో గుర్తిస్తారా లేదా

# రేవంత్‌వి దొంగ మాటలు

-మొదటిపేజీ తరువాయి

12 కాలాల పాటు 73 వేల కోట్లు రైతుల అకౌంట్‌లలో వేసిన ఘనుడు కేసీఆర్ అని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రేవంత్ దొంగ మాటలు.. మోసం మాటలు చెప్పి మొండి చెయ్యి చూపారని మండిపడ్డారు. సోనియాగాంధీ జన్మదినం రోజు వరకు రుణమాఫీ అన్నారని.. రెండు జన్మదిన వేడుకలు అయిపోయాయన్నారు. 35 సార్లు ఢిల్లీ వెళ్లారని..35 పైసలు కూడా తెలంగాణకు తీసుకురాలేదని దుయ్యబట్టారు. రైతుల కుటుంబాలవి.. రేపో మాపో పుస్తెల తాడు బ్యాంక్ వాళ్ళు తీసుకుపోతారన్నారు. రైతుకు కులం మతం ఉండదన్నారు. 70 లక్షల రైతులకు బీఆర్ఎస్ రైతు బంధు వేశారని.. 73 వేల కోట్ల రూపాయలు అకౌంట్స్‌లో కేసీఆర్ వేశారని తెలిపారు. ప్రజలు మోసం చేస్తేనే నమ్ముతారని రేవంత్ రెడ్డి అన్నారన్నారు. ముఖ్యమంత్రి ఇన్ని తిట్లు తినంగా తానెప్పుడూ చూడలేదన్నారు.



బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 430 మంది రైతులు రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. పేద పిల్లలు ఉన్నత చదువులు చదవాలని గురుకులాలు పెడితే.. రేవంత్‌కు వాటిని నడపడం చాత కావడం లేదన్నారు. అన్ని వర్గాల వారు ఈ దరిద్రపు పాలనలో విసిగి ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఇపుడు లోకల్ బాడీ ఎన్నికలు వస్తున్నాయి కనుక రైతు భరోసా అని మోసం చేస్తున్నారన్నారు. రేవంత్ ఎకరాకు 17 వేల రూపాయల చొప్పున బాకీ ఉన్నారని.. కానీ ఈసారి మోసపోతే ఇక బాగు చేసే వారు ఉండరన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఇంటికి వస్తే నిలదీయాలని అన్నారు. గతంలో రేవంత్ కుటుంబానికి 500 ఎకరాలు ఉండేవని.. ఇపుడు మరో 1000 ఎకరాలు చేసుకున్నారని వమిర్శించారు. రేవంత్‌కు రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ గురించి పట్టదన్నారు. రుణమాఫీకి పైసలు లేవని.. పాల రైతులకు పైసలు లేవని కానీ మాటలు మాత్రం కోటలు దాటుతాయని దుయ్యబట్టారు. ఇక్కడ లంకె బిందెలు లేవని రేవంత్ అంటున్నారని.. లంకె బిందెల కోసం ఎవరు తిరుగుతారో అందరికీ తెలుసన్నారు. రేవంత్ పతనం ఆయన అత్తగారి ఊరైన కల్వకుర్తి నుంచి ప్రారంభంకావాలని కేటీఆర్ పేర్కొన్నారు.

**రేవంత్‌వి దొంగ మాటలు: రైతుదీక్షలో కేటీఆర్**

సీఎం రేవంత్ ఏ ఒక్క హామీనైనా అమలు చేశారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మంగళవారం(ఫిబ్రవరి 18) అమన్‌గల్‌లో జరిగిన రైతుదీక్షలో కేటీఆర్ మాట్లాడారు.'సీఎం రేవంత్ 420 హామీలు ఇచ్చారు. రైతుబంధు, రుణమాఫీ ఎవరికైనా వచ్చాయా. తులం బంగారం వచ్చిందా. ఏదీ రాలేదు. దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ కొడంగల్‌కు, తల్లి గారి ఊరికి, అత్తగారి ఊరికి ఎవరికీ ఏమీ చేయలేదు. 42 శాతం రిజర్వేషన్‌లని చెప్పి బీసీలను మోసం చేసిండు. రైతులను మోసం చేసిండు. అరచేతిలో ?స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చాడు. సన్యాసి రేవంత్‌కు పాలన చేతనైతలేదు 'అని కేటీఆర్ ఫైరయ్యారు

# సైబర్ సేఫ్టీలో తెలంగాణ ముందుండాలి

-మొదటిపేజీ తరువాయి

ఆర్థిక వ్యవస్థకు, మన పౌరులకు ముప్పు. ఈరోజుల్లో ఫేక్ న్యూస్ అనేది మరో ప్రధానమైన ముప్పు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో సమాజంలో గందరగోళం ఏర్పడు తుంది. సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ కోసం ఎకో సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు... మా ప్రభుత్వం నిపుణులు, ఎ సంస్థలతో కలిసి పనిచేయడానికి, అన్ని రకాల వనరులు సమకూరుస్తోంది. మనం తెలంగాణను సెక్యూర్ బిజినెస్ హబ్ గా మార్చాలి. 1930 నంబర్ ను అందరికీ షేర్ చేయాలని ప్రతీ ఒక్కరినీ కోరుతున్నా.. ఇది 24/7 సైబర్ హెల్ప్లైన్. పూర్తి స్థాయిలో పనిచేసే సైబర్ సెక్యూరిటీ బ్యూరో, పౌరులను రక్షించడానికి అంకితమైన సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. మేం గత ఏడాది 7 కొత్త ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించామని అన్నారు. ఈ సౌకర్యాలను ఏర్పాటు చేసిన డీజీపీ, సైబర్ బ్యూరో డైరెక్టర్ని ఈ సందర్భంగా నేను అభినందిస్తున్నా. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు సీఎస్బీ బృందాన్ని అభి నందిస్తున్నా. తెలంగాణను సైబర్ సేఫ్ స్టేట్ గా మార్చేం దుకు మనమంతా కలిసి పని చేద్దామని అన్నారు. నేరాల విధానం వేగంగా మారుతోంది. సమాజంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కో వడానికి అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి . సైబర్ క్రైం ను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉంది . కానీ సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలో పేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని అయన అన్నారు.

# పౌల్ట్రీ రైతులకు కోట్లల్లో నష్టం

**హైదరాబాద్ :** బర్డ్ ఫ్లూ విజృంభిస్తున్నది. ఇప్పటికే ఏపీలో లక్షలాది కోళ్లు చనిపోయాయి. పౌల్ట్రీ రైతులకు కోట్లల్లో నష్టం వాటిల్లింది.. బర్డ్ ఫ్లూ విస్తరిస్తున్న నేపథ్యంలో చికెన్ తినొద్దని ప్రభుత్వాలు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరులో ఓ వ్యక్తిలో బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపించడంతో.. రెండు తెలుగు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. ఆంధ్ర సరిహద్దుల్లో నుంచి కోళ్లను తెలంగాణలో కిరానివ్వకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్న నేపథ్యంలో చికెన్ అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. మొన్నటిదాకా కిలో చికెన్ ధర 230 నుంచి 250 వరకు పలకగా.. ఇప్పుడు అది 150 కి పడిపోయింది. దీంతో పౌల్ట్రీ సంస్థలు దారుణంగా నష్టపోతున్నాయి. బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్న నేపథ్యంలో చికెన్ కు డిమాండ్ అమాంతం పడిపోయింది. అయితే బర్డ్ ఫ్లూ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు హైదరాబాదులో దాడులు చేయడం మొదలుపెట్టారు. హైదరాబాదులోని రసూల్ పుర అన్నా నగర్ ప్రాంతంలో అధికారులు తనిఖీలు నిర్వహించగా దిమ్మ తిరిగిపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఆ తనిఖీల్లో పాల్గొన్న అధికారులు ముక్కు మూసుకోవాల్సి వచ్చింది.హైదరాబాద్ నగరంలో విస్తారంగా రెస్టారెంట్లు, హోటళ్లు ఉంటాయి. వీటన్నింటికీ పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల నుంచి చికెన్ సరఫరా అవుతున్నది. చికెన్ కు ప్రస్తుతం డిమాండ్ తగ్గడంతో.. దానిని క్యాష్ చేసుకోవడానికి చికెన్ సప్లయర్స్ సరికొత్త మార్గాన్ని అన్వేషించారు. తక్కువ ధరకు కోళ్లను కొని.. వాటి మాంసాన్ని నిలువ చేయడం మొదలుపెట్టారు. ఇలా నిల్వచేసిన మాంసాన్ని హైదరాబాద్ నగరంలోని వివిధ రెస్టారెంట్లకు, హోటళ్లకు సరఫరా చేస్తున్నారు.. అయితే దీనిపై సమాచారం అందడంతో అధికారులు రసూల్ పుర ప్రాంతంలోని అన్నా నగర్ లో



తనిఖీలు నిర్వహించారు. వారు తనిఖీలు నిర్వహించగా ఐదు క్వింటాళ్ల కుళ్ళిన చికెన్ కనిపించింది. పైగా ఆ చికెన్ తీవ్రమైన దుర్వాసన వస్తున్నది. దీంతో షాక్ కు గురికావడం అధికారుల వంతు అయింది. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ తక్కువ ధరకు దొరుకుతున్న నేపథ్యంలో.. రెస్టారెంట్లకు పాత రేటుకే సప్లయర్స్ అమ్ముతున్నారు. పైగా తక్కువ ధరకు కోళ్లను ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేసి.. వాటిని వధించి ఇలా చికెన్ నిల్వ చేస్తున్నారు. బ్రాయిలర్ చికెన్ ఎక్కువ కాలం నిల్వ ఉండదు. దానిని నిల్వ ఉంచాలంటే రసాయనాలు వాడాల్సి ఉంటుంది. అలాంటి పనిని కొంతమంది సప్లయర్స్ చేస్తున్నారు. అయితే వారి దుర్మార్గం ఇప్పుడు ఇలా అధికారులతో వెలుగులోకి వచ్చింది.. ఇప్పుడు మాత్రమే కాదు.. గతంలోనూ ఈ ప్రాంతంలో ఇలానే కుళ్ళిన చికెన్ నిలువ చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. నాడు అధికారులు ఇలాంటి వ్యవహారాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకున్నారు. కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ సప్లయర్స్ తమ ధోరణి మార్చుకోవడం లేదు. అడ్డగోలుగా దోచుకోవడానికి ఇలా కుళ్ళిన చికెన్ అమ్ముతూ.. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు.

## 17 బ్రిడ్జిల నిర్మాణంపై సర్వే.. మరో నెలలో సర్కార్‌కు రిపోర్ట్



**హైదరాబాద్,** ఫిబ్రవరి 18: మూసీ ప్రక్షాళనకు సంబంధించి తెలంగాణ సర్కార్ మరో ముందడుగు వేసింది. మూసీ బ్రిడ్జిల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టిసారించింది. మూసీపై ఉన్న 17 బ్రిడ్జిలను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సర్వే చేయిస్తోంది. నిజాం కాలంలో కట్టిన బ్రిడ్జిల పటిష్టతను ఇంజనీరింగ్ నిపుణులు పరిశీలిస్తున్నారు. రీబౌండ్ హ్యామర్ టెస్ట్, గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్, డైనమిక్ లోడ్ టెస్టింగ్‌ను సంస్థ నిర్వహిస్తోంది. నాగోల్, ఇమ్లి బండ్, ముస్లింజంగ్, నయాపూల్, పురాణాపూల్, టిప్పు ఖాన్, బాపూఘాట్, అత్తాపూర్, చాదర్ఘాట్, గోల్నాక, సాలార్జంగ్ ప్రాంతాల్లో నిర్మించిన బ్రిడ్జిలను సంస్థ ప్రతినిధులు పరిశీస్తున్నారు. బ్రిడ్జిల పటిష్టతపై మరో నెలలో ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనున్నారు. చాధర్ ఘాట్ బ్రిడ్జి హైట్ పెంచాలని నివేదికను సిద్ధం చేసింది సంస్థ. మూసీ పైనున్న బ్రిడ్జిలను వారసత్వ కట్టడాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. అవసరం అయితేనే పూర్తిగా కూల్చి... వాటి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. మూసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మరో మూడు నెలల్లో మూసరాం బాగ్ హై లెవెల్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. దీన్ని 29.5 మీటర్ల పొడవు, 6 లేన్లతో 20 మీటర్ల క్యారేజ్ వే, 3.5 మీటర్ల ఫుట్ పాత్‌తో నిర్మాణం జరుగుతోంది. దాదాపు రూ.65 కోట్లతో ముసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.

## 'కేసీఆర్ హీరో అయితే ఎందుకు గెలవలేదు'



**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం కులగణన వందశాతం సరిగా చేసిందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం(ఫిబ్రవరి 18) మీడియాతో సుఖేందర్‌రెడ్డి చిట్‌చాట్ నిర్వహించారు.'అసలు కులగణ మీద బీసీల జనాభాపై లెక్క ఎక్కడ ఉంది. దేశంలోనే ఇదే మొదటిసారి కదా బీసీ కులగణ చేసింది. సమగ్ర కుటుంబ సర్వే అఫీషియల్ రికార్డు లేదు.అసెంబ్లీలో పెడితే రికార్డులో ఉండేది. ప్రజలతో మమేకమైన వాడే నాయకుడు అవుతాడు.కులం,మతం తో సంబంధం ఉండదు.బీజేపీ బీసీ కులగణకు వ్యతిరేకమని అందరికి తెలిసిందే. రాజకీయం,ప్రభుత్వ సంస్థలు ఇతర వ్యవస్థలపై సైతం నమ్మకం తగ్గుతుంది.ఉచితాలపై ఒక కఠినమైన చట్టం రావాల్సిందే. రాష్ట్ర బడ్జెట్‌ను బట్టి పథకాలు ఉండాలి.ఈ ప్రభుత్వ పాలన పర్వాలేదు.కేసీఆర్ త్యాగాలు చేసింది నిజమే.తెలంగాణ ఉద్యమం నడిపించింది వాస్తవమే.కానీ 4కోట్ల ప్రజల హీరో అంటే.. మరి ఎన్నికల్లో 4 కోట్ల ప్రజలు ఓట్లు వేయలేదు కదా..నువ్వు నేను కోరుకుంటే ఎన్నికలు రావు.ప్రభుత్వం పడిపోతుంది అంటే అది అధికారం కోల్పోయిన బాధలో మాట్లాడుతున్నారని ప్రజలు అనుకుంటారు'అని సుఖేందర్‌రెడ్డి అన్నారు.

## ఎస్సీ వర్గీకరణ అంశం... ఏకసభ్య కమిషన్ కాలపరిమితి పొడిగింపు



ఎస్సీ వర్గీకరణ అంశంపై హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కాలపరిమితిని తెలంగాణ ప్రభుత్వం మరోసారి పొడిగించింది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణపై సమగ్ర అధ్యయనం చేసేందుకు జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం చేసి సిఫార్సు చేసేందుకు జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్‌గా గత ఏడాది నవంబర్ 11వ తేదీన బాధ్యతలు చేపట్టారు. వర్గీకరణపై సమగ్ర అధ్యయనం చేసి రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. మొదటిసారి, జనవరి 10వ తేదీన గడువు ముగియడంతో ఈ కమిషన్ కాలపరిమితిని ఫిబ్రవరి 10 వరకు పొడిగించారు. కమిషన్ ఇటీవలే ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే, ఈ నివేదికపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో అభ్యంతరాలను పునఃపరిశీలించాలని సూచిస్తూ కమిషన్ కాలపరిమితిని మార్చి 10వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

## నేను ఐదు సంవత్సరాలు కేసీఆర్ క్యాబినెట్ మంత్రినే..



**హైదరాబాద్:** తాను కేసీఆర్ క్యాబినెట్ లో ఐదేళ్లు మంత్రిగా చేశానని, మంత్రులకు ప్రగతి భవన్ లోకి ఎంట్రీ లేదని, అందుకు తానే సాక్ష్యమన్నారు మంత్రి జూపల్లి కృష్ణారావు. మంగళవారం సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన జూపల్లి.. ' కేసీఆర్ మీటింగుల్లో కేసీఆర్ వచ్చేదాకా ఎవరూ మాట్లాడడానికి అవకాశం ఉండకపోయేది. కేజ్రీవాల్ ఓడిపోవడానికి కారణం ఎవరో అందరికీ తెలుసు. తెలంగాణలో ఆరిపోయింది కాకుండా ఢిల్లీలో అరిపోయారు. సెక్రటేరియట్ కట్టడం తప్పు పట్టడం లేదు కానీ, సెక్రటేరియట్ రాకపోవడం తప్పని ఆనాడే అన్నాను. అమరవీరుల చిహ్నం, అంబేద్కర్ విగ్రహం పెట్టడానికి పదేండ్లు పట్టిందా?, బీఆర్ఎస్ ఓడిపోవడానికి వాళ్ళ స్వయంకృపరాదమే కారణం. కేసీఆర్ పాలన రావాలని తెలంగాణ ప్రజలు తపిస్తున్నట్టు నిన్న ఆయన అనుచరులు ప్రచారం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర కూడా ఉంది. ఎంతో మంది ప్రాణత్యాగం, ఎంతోమంది పోరాటం, రాజకీయ సంఘర్షణలు తెలంగాణ రాష్ట్రం కోసం జరిగాయి. పది సంవత్సరాల తర్వాత కూడా కేసీఆర్ పాలన కావాలని ఎందుకు కోరుకుంటారు. గడిచిన 65 సంవత్సరాల్లో 18 మంది ముఖ్యమంత్రులు 65 వేల కోట్ల అప్పు చేశారు.

## సెంట్రల్ జైలు ప్రాంగణంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ను ప్రారంభించారు.





మంగళవారం వరంగల్ జిల్లా మామునూరులోని సెంట్రల్ జైలు ప్రాంగణంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ను జైళ్ల శాఖ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా, వరంగల్ రేంజ్ డిఐజీ యం. సంపత్, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, లతో కలసి జైలు సూపరింటెండెంట్ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నుంచి విజ్ఞప్తులను వినతులను స్వీకరించిన మంత్రి "కొండా సురేఖ"



ఈరోజు అటవీ,పర్యావరణ ,దేవాదాయ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి కొండా సురేఖ గారు హనుమకొండ రామ్ నగర్ లో తమ నివాసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు రాంనగర్ లోని తమ నివాసానికి చేరుకుని తమ సమస్యలను మంత్రి కొండా సురేఖ గారికి విన్నవించారు. వారి సాధకబాధకాలను మంత్రి కొండా సురేఖ గారు సహృదయంతో విని సంబంధిత పలువురు అధికారులతో అప్పటికప్పుడే ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. సులువుగా పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను మంత్రి సురేఖ మందలించారు. మరోసారి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలకు వెనకాడనని మంత్రి సురేఖ వారికి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ గారు మాట్లాడుతూ, ఏ సమస్యలున్నా ప్రజలు తనను సంప్రదించవచ్చునని కొండా సురేఖ ప్రజలకు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం దిశగా అధికారుల నుంచి సరైన స్పందన లేనిపక్షంలో తనకు తెలియజేయాలని వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాలజీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నదని మంత్రి కొండా సురేఖ వారికి భరోసానిచ్చారు.

## విద్యార్థులకు కంటిపరీక్షలు చేయించాలి





హన్మకొండ జిల్లా లోని అన్ని యాజమాన్యం ల లోని 968 పాఠశాల లో గత సంవత్సరం మొదటి దశ గా మార్చి, ఏప్రిల్ మాసంలో రెండవ దశలో సెప్టెంబర్ అక్టోబర్ నవంబర్ నెలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించ గా 137 పాఠశాల లో 2357 మంది విద్యార్థుల కు దృష్టి లోపం ఉన్నట్లు గా నిర్ధారణ చేయటం జరిగింది. ఈ 2357 మంది విద్యార్థుల కు వరంగల్ ప్రాంతీయ కంటి ఆసుపత్రి లో 17 ఫిబ్రవరి నుండి 28 ఫిబ్రవరి వరకు తిరిగి రెండవ సారి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి వాసంతి గారు తెలియ చేశారు. రోజు వారిగా మండలం వారిగా ప్రణాళిక సిద్ధం చేసి పాఠశాల ల ప్రధానోపాధ్యాయుల కు ఇవ్వడం జరిగింది అని, ప్రతీ రోజు మూడు వందల మంది విద్యార్థుల కు పరీక్షలు చేస్తారని చెప్పారు. విద్యార్థుల ను ఆరోగ్యశాఖ బృందం పాఠశాల నుండి వాహనం లో తీసుకొని వెళ్లి తిరిగి తీసుకొని వస్తారని చెప్పారు. ప్రతీ మండలంలో ఎంపిక చేసిన విద్యార్థులు కంటి పరీక్షల కు వెళ్లే విధంగా మండల విద్యాశాఖాధికారులు మార్గదర్శ నం చేయాలని సూచించారు. అదనపు సమాచారం గురించి సమగ్ర శిక్షా సమ్మిళిత విద్యా సమన్వయ కర్త బద్దం సుదర్శన్ రెడ్డి 9603672289 గారిని సంప్రదించగలరు .

## ఘనంగా మాజీ ఏ. జి. పి ఉప్పల గోపాలకృష్ణ మూర్తి జన్మదిన వేడుకలు...

హుజూర్ నగర్ మీ వార్త న్యూస్



హుజూర్ నగర్ పట్టణంలో మంగళవారం మాజీ ఏ. జి. పి – ఉప్పల గోపాల కృష్ణమూర్తి జన్మదిన వేడుకలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్లు కుక్కడపు బాలకృష్ణ, నట్టే సత్యనారాయణ,రవికుమార్, కృష్ణయ్య, బొబ్బ కోటి రెడ్డి, అంబటి శ్రీనివాస్, జూనియర్ అడ్వకేట్ లు సైదా హుస్సేన్, జుట్టుకొండ సంధ్య, పసుపులేటి వీరు ,చిట్టిపోతుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులు
# ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలి






జిల్లా విద్యాధికారి ముద్దమల్ల రాజేందర్

చిట్యాల ఫిబ్రవరి 18 (మీవార్త)

పదవ తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలని జిల్లా విద్యాధికారి ముద్దమల్ల రాజేందర్ అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి ముద్దమల్ల రాజేందర్ మంగళవారం రోజున సందర్శించారు ఈ సందర్భంగా పాఠశాలలోని వివిధ రకాల రికార్డులను పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి కష్టపడి ప్రణాళిక బద్ధంగా చదివి విద్యార్థులందరూ అత్యుత్తమ మార్కులతో పాస్ కావాలని విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు సెక్టోరియల్ ఆఫీసర్ రాజగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులను వివిధ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుండి జవాబులను తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో విద్యా ప్రమాణాలు సంతృప్తికరంగా ఉన్నాయని ఆనందాన్ని వెలిబుచ్చాడు రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో చిట్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో పాస్ కావాలని విద్యార్థులలో ప్రేరణ కల్పించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ రఘుపతి. ఉపాధ్యాయులు కూచనపల్లి శ్రీనివాస్ .బొమ్మ రాజమౌళి .నీలిమ రెడ్డి .సుజాత .విజయలక్ష్మి. కల్పన. ఉస్మానాలి .మౌనిక .పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సూధం సాంబమూర్తి. తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా బిజెపి బలపరిచిన అభ్యర్థి శ్రీ పులి సరోత్తం రెడ్డి గారికి మీ అమూల్యమైన ఓటు మొదటి (1) ప్రాధాన్యత కి వేసి గెలిపించగలరు





నల్గొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా బిజెపి బలపరిచిన అభ్యర్థి శ్రీ పులి సరోత్తం రెడ్డి గారికి మీ అమూల్యమైన ఓటు మొదటి (1) ప్రాధాన్యత కి వేసి గెలిపించగలరని శివనగర్ 34వ డివిజన్ లో బిజెపి శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ముఖ్యఅతిథిగా బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ గారు పాల్గొని ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ఓటుని అభ్యర్థించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. పులి సరోత్తం రెడ్డి గారు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా మూడున్నర దశాబ్దాలకు పైగా అనుభవమున్న వారని, ఆది నుండి ఉపాధ్యాయుల సమస్యల గురించి గళం ఎత్తుతూనే ఉన్నారని, GO 317 వలన ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పోరాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, ఉపాధ్యాయుల సమస్యలను అర్థం చేసుకొని, సమస్యల పరిష్కారానికై పోరాడిన వారిలో సరోత్తం రెడ్డి గారు ముఖ్యులని అన్నారు. ఓటర్ల వారి అభిప్రాయ సలహాలు తీసుకొని మొదటి ఓటు బిజెపికి వేయాలని ప్రతి ఒక్క ఓటర్లకు విన్నవించుకోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, డివిజన్ ఓ.బి.సి అధ్యక్షులు బోడకుంట్ల శివశంకర్, బూత్ అధ్యక్షులు పావుశెట్టి స్వరూప, TVLN శ్రీనివాస్, శెట్టి రమేష్ గార్లు పాల్గొన్నారు.

## పురపాలక సంఘం
# ఆధ్వర్యంలో పనులు భేష్

జిల్లా కలెక్టర్ దిశానిర్దేశ్యంతో పనులు మరింత వేగవంతం.

మీ వార్త సూర్యపేట జిల్లా ప్రతినిధి షేక్ జహీర్



పెద్దగట్టు జాతర ఫిబ్రవరి 16 నుండి ప్రారంభమై 20 వరకు సాగే జాతరలో వచ్చే భక్తులు, ప్రజలకు పురపాలిక ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ పనులు ఎప్పటికప్పుడు భేష్ అనిపిస్తున్నాయి. భక్తులు మొక్కులు తీర్చానున్నడంతో జెట్టింగ్ మిషన్ ద్వారా రక్తపు మరకలు కనిపించకుండా శుభ్రం చేయడం జరిగింది. అదేవిధంగా పలు ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు అధికంగా త్రాగునీటిని వినియోగించుకొని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదేవిదంగా జాతరకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పారిశుధ్య కార్మికులను నిర్దేశించిన ప్రాంతాలలో ఉంచి ఎప్పుడికప్పుడు పాటిశుధ్య పనులు చేపడుతున్నారు. జిల్లా కలెక్టర్ దిశనిర్దేశ్యంతో దురాజ్ పల్లి జంక్షన్ నుండి గుడి చుట్టూ 8 జోన్లు ఏర్పాటు చేయడంతో పనులు మరింత వేగవంతంగా సాగుతున్నాయి. జాతరలో జోన్లల వారీగా కేటాయించి పారిశుధ్య పనులు చేయుటకు మూడు షిఫ్టుల వారీగాసిబ్బందికి డ్యూటీ లు కేటాయించారు . షిఫ్ట్ ఒక్కంటికి 130 మంది పారిశుద్ధ్య కార్మికులను, 48 బాక్స్ మొబైల్ టాయిలెట్స్ క్లినింగ్ కు షిఫ్ట్ కు 16 మంది స్కా వెంజర్లు, 7 పర్మినెంట్ టాయిలెట్లు క్లినింగ్ కు 14 మంది స్కావెంజర్లు నియమించారు. వీరితో పనులు చేయించుటకు గాను 12 మంది జవాన్లు, 24 మంది సూపర్ వైజర్లు.24 మంది జోనల్ ఆఫీసర్లు ముగ్గురు శానిటరీ ఇన్స్పెక్టర్లు, మరుగుదొడ్ల క్లినింగ్ పనులు పర్యవేక్షణ చేయుటకు ముగ్గురు ని నియమించారు. జాతరలో చెత్త డంపింగ్ చేయుటకు గాను షిఫ్టుకు 4 ట్రాక్టర్లను ఏర్పాటు చేసి భక్తులు, ప్రజల మన్ననలు పొందుతున్నారు.

## ఐదు మండలాల ప్రజలకు ఆంక్షలు ఎత్తివేత

మంచిర్యాల.జన్నారం :మీ వార్త




కావ్వాల్ అభ్యారణ్యం చెక్ పోస్టుల ద్వారా ఐదు మండలాల ప్రజలకు ఆంక్షలు ఎత్తివేయడం జరిగిందని, జన్నారం మండలం ఇందుపల్లి రేంజ్ ఎఫ్ ఆర్ ఓ కారం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఎఫ్ డి పి టి శాంతారామ్ ఆదేశాల మేరకు జన్నారం డివిజన్లోని జన్నారం,దండేపల్లి, ఖానాపూర్ ఎక్కడ డివిజన్లోని దస్తురాబాద్, కడెం,ఉట్నూర్ డివిజన్లోని ఉట్నూర్ మండలాల ప్రజలు ఇంధనపెల్లి చెక్ పోస్ట్ ద్వారా 24 గంటలు ప్రయాణించడానికి అనుమతి ఉంటుందని,ఐదు మండలాల వాహనాదారులకు ఎలాంటి సెస్ చెల్లించవలసిన అవసరం లేదని అన్నారు. ఈ ఐదు మండలాల ప్రజలు గమనించి అటవీ శాఖ అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలగజేయకుండా ధ్రువీకరణ పత్రాలు చూపించి వెళ్ళవలసినదిగా ఆయన సూచించారు.

## వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా సమగ్ర కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలి

– రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి తెలిపారు.



మంగళవారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం, హైదరాబాద్ నుండి వేసవిలో త్రాగునీరు, విద్యుత్ సమస్యలు రాకుండా చేపట్టాల్సిన చర్యలు, యాసంగిలో సాగునీరు, రైతు భరోసా, సంక్షేమ వసతి గృహాలు తనిఖీ ప్రజాపాలన కుటుంబ సర్వే దరకాస్తులు ఆన్లైన్ తదితర అంశాలపై ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిపి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వచ్చే వేసవికాలంలో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది రాకుండా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మంచినీటి పైపులైన్స్ లీకేజీ లు లేకుండా అరికట్టాలని అన్నారు. ఆర్ డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు. మంచినీటి కొరత వచ్చిన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని తెలిపారు. యాసంగి పంటలకు సాగునీటి సమస్య రాకుండా ప్రాజెక్టులు, చెరువులల్లో నీటి లభ్యతను పరిశీలించాలని తెలిపారు. నిరంతరం తనికీలు నిర్వహిస్తూ అక్రమ నీటి వాడకాన్ని, నీటి వృధాను అరికట్టాలని స్పష్టం చేశారు. యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.
జిల్లాలోని సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. క్రమం తప్పక వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మంచినీటి కొరత వచ్చిన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, స్థానిక వనరులను గుర్తించాలని తెలిపారు. లీకేజీ లు అరికట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, ఈ ఈ పి ఆర్, డి సి ఎస్ ఓ, డి ఏ ఓ, డి ఈ ఎలక్ట్రిసిటీ, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని లక్ష్మీ నర్సింగ్ హెూమ్ ను తనిఖీ





**మహబూబాబాద్, ఫిబ్రవరి.18**

మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. మురళిధర్ మరియు ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని లక్ష్మీ నర్సింగ్ హెూమ్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ నర్సింగ్ హెూమ్ లో వైద్యుడు డాక్టర్ ఇంద్రసేనారెడ్డి,వారు అంధించే సేవలకు సంబంధించి తీసుకునే రుసుముల పట్టికను అందరికీ తెలిసే విదముగా తెలుగులో రుసుముల వివరాలు తెలియపరచాలని జిల్లా వైద్యాధికారి అన్నారు. అదేవిధంగా ప్రతి ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లు, యాజమాన్యాలు విధిగా దరల పట్టికను ప్రదర్శించాలని, సిబ్బంది కి సంభందిచిన ధ్రువీకరణ పత్రాలను విధిగా తనిఖీ అధికారులకు చూపించాలని, నర్సింగ్ హెూమ్ లో పనిచేసే సిబ్బంది హాజరు పట్టికలో హెూదాను రాయాలని మరియు వారి యొక్క క్వాలిఫైడ్ సర్టిఫికెట్స్ ను ఆసుపత్రి సిబ్బంది వివరాలను మారినట్లయితే, జిల్లా కార్యాలయానికి క్వాలిఫైడ్ జిరాక్స్ కాపీలను పంపించాలని, ఆసుపత్రి రికార్డు ల నిర్వహణ తనిఖీ చేయడం జరిగింది. జనన ధ్రువీకరణ పత్రాలు పుట్టిన వెంటనే ఇవ్వాలని, హాస్పిటలకు వచ్చే రోగులకు మర్యాదగా మాట్లాడాలని, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు అనుమతి పొందిన రేడియాలజిస్టులు లేదా గైనకాలజిస్టు మాత్రమే గర్భవతులకు స్కానింగ్ చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాత ఆడ మగ అని తెలుపుట చట్టరీత్యా నేరమని పేర్కొంటూ అన్ని స్కానింగ్ సెంటర్లలో ,స్కానింగ్ చేసే గదిలో మరియు ఫామ్ -F ఏ రోజువి ఆ రోజే ఆన్లైన్ చేయాలని, ఆన్లైన్ చేసిన అన్ని ఫారం-F లు అన్నీ ప్రతినెల 5వ తారీఖు లోపు జిల్లా వైద్యఆరోగ్య శాఖా కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు.

ఈ తనికీలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విజయ్ కుమార్, ఆరోగ్య విద్యా బోధకులు కె,వి. రాజు సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పౌరసంబంధాల అధికారి, మహబూబాబాద్ వారిచే జారీచేయనైనది.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకం

# భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు






**పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ - 1994పై ఓరియెంటేషన్ సదస్సు**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు.**

మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో మహిళా, శిశు, వయోవృద్దులు, దివ్యాంగుల శాఖ (మహిళా శక్తి - సామర్థ్య, మహిళా సాధికారత కేంద్రం(DHEW)), వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా డీసీపీ రాజమహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ - 1994పై ఐసీడీఎస్ సూపర్వైజర్ లు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలకు ఓరియెంటేషన్ సదస్సును నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ - 1994ను సరిగ్గా అమలు చేయాలన్నారు. పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ ప్రకారం భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి (3) సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 10,000 జరిమానా విధించడం జరుగుతుందన్నారు. అలాగే ఈ చర్యల పట్ల ప్రోత్సహించిన వారికి, సహకరించిన వారికి (5) ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 50,000 జరిమానా విధించడం జరుగుతుందని వివరించారు.

గ్రామ, మండల స్థాయిలో ప్రజలకు లింగ నిష్పత్తిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

జిల్లాలో ఎక్కడా కూడా లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఆసుపత్రిలో, స్కానింగ్ సెంటర్లలో ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేసి ఈ చట్టంపై ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తూ అవగాహన కల్పించాలన్నారు.

అదే విధంగా పీవోలు, డిప్యూటీ డీఎంహెచ్ఓలు ప్రతి ఆసుపత్రిని, జిల్లాలో గల మొత్తం 21 స్కానింగ్ సెంటర్లను సందర్శించి, పరిశీలించాలని ఆదేశించారు. ఎవరైనా ఈ చట్టాన్ని అతిక్రమిస్తే చట్టపరమైన (ఐపీసీ ప్రకారం కూడా) కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


అంతకుముందు పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ - 1994పై అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, తదితరులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

అనంతరం జిల్లాలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారు, భ్రూణ హత్యలు చేసే వారి గురించి ఫిర్యాదు చేయడానికి మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181, అలాగే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నంబరులో సంప్రదించాలని కలెక్టర్ కోరారు. అదే విధంగా సమాచారాన్ని సీల్డ్ కవర్ ద్వారా పోలీసు అధికారులకు, తమకు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుడి పేరును బయటకు రానివ్వమని, ఎలాంటి భయాలకు గురికావొద్దని, ఈ విషయమై సమాచారం ఇచ్చిన వారికి రూ. 10 వేల నజరానా ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డీఎంహెచ్ఓ మల్లికార్జున్ రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీదేవి, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ హెచ్. శారద, ప్రోగ్రామింగ్ అధికారి రవీందర్ గౌడ్, సీడీపీఓలు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లే బాధ్యత గ్రామ నాయకులదే..

**కష్టపడ్డ ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటా. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కొరకు కలిసికట్టుగా పని చేయాలి,**

**మీ వార్త పరకాల ప్రతినిధి**



రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే జీఎస్సార్..రేగొండ/కొత్తపల్లిగోరి మండలాలు, 18 ఫిబ్రవరి 2025 కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి, నా గెలుపు కొరకు కష్టపడ్డ ప్రతీ ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈరోజు మంగళవారం రోజున రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రాలల్లో వేరువేరుగా ఉమ్మడి రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన అన్ని గ్రామాల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు అన్ని గ్రామాలలో పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించాలని, అందుకొరకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కష్టపడే ప్రతి ఒక్కరికి అవకాశాలు వస్తాయని, పదవులు కోరుకుంటే రావని, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లే బాధ్యత గ్రామ నాయకులదేనన్నారు. వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. పాత, కొత్త నాయకత్వం అని తేడా లేకుండా పనిచేయాలన్నారు. గ్రామాలలో వర్గాలుగా విడిపోయి పార్టీకి నష్టం చేసేలా చూస్తే ఊరుకునేది లేదన్నారు.

కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే...

రెండు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశాల కంటే ముందు ఎమ్మెల్యే రేగొండ మండలం కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం దేవాలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ చేతికి నేతలతో కలిసి పరిశీలించారు. పనులను త్వరితగతిన నాణ్యతతో చేపట్టాలని సూచించారు.

## డ్రైన్ నిర్మాణానికి సహకరించండి: బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే

**- తెలంగాణ కాలనీ లో క్షేత్ర స్థాయి లో పరిశీలన...**





స్థానిక కాలనీవాసులు డ్రైన్ నిర్మాణానికి సహకరించాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అన్నారు. నగర పరిధిలోని 42 వ డివిజన్ తెలంగాణ కాలనీలో డ్రైన్ ఏర్పాటుకు టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు నిర్వహించిన కార్యక్రమం లో కమిషనర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానిక ప్రజల యొక్క సౌకర్యార్థం డ్రైన్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందుకోసం స్థానికుల తో పాటు సదరు యాజమాన్యం సహకరించాలని వారికి న్యాయం చేస్తామని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర ఇన్చార్జి సిపి రవీంద్ర రాడే కర్ ఈ ఈ శ్రీనివాస్ టి పి ఎస్ అనిల్ ఏ ఈ మోజామిల్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లిలో యూరో కిడ్స్ యానువల్ డే సెలబ్రేషన్స్


**కూకట్ పల్లి ప్రతినిధి రవీందర్ రెడ్డి ఫిబ్రవరి 18 మీ వార్త**




క్రమశిక్షణ నైతిక విలువలతో కూడిన విద్యకు తమ స్కూలు ప్రాధాన్యత నిస్తుందని యూరో కిడ్స్ స్కూల్ యజమాని రమ్యశ్రీ పేర్కొన్నారు. తమ సంస్థకు చెందిన చింతల్, గాజుల రామారం బ్రాంచీలకు సంబంధించి యాన్యువల్ డే ఉత్సవాలను కూకట్పల్లి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి లక్ష్యాలకు అనుగుణంగా విద్యను నేర్పడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు పాటలు ఆహుతులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరై తమ చిన్నారులను ప్రోత్సహించారు.

## రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కూన సత్యం గౌడ్

**శేరిలింగంపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 18 మీ వార్త**



సమగ్ర కుల సర్వే నిర్వహించి, ఓబీసీల సాధికారత కోసం డేటాను ఉపయోగించాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన కార్యక్రమం దేశానికి దిశా నిర్దేశంగా ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో దేశంలోనే ప్రధమంగా మొదలుపెట్టి రికార్డ్ సృష్టిస్తూ విజయవంతంగా పూర్తి చేసిన బీసీ కుల గణన సర్వే సందర్భంగా శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కూన సత్యం గౌడ్ , శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్ తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలాగౌడ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్స్ ను పరిశీలించిన మండల స్పెషల్ ఆఫీసర్






విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్

**చిట్యాల, ఫిబ్రవరి 18 (మీ వార్త) :**

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అలాగే ఆదర్శ పాఠశాలను మండల స్పెషల్ ఆఫీసర్ డిసిఓ వాల్యా నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లోని అటెండెన్స్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. వంటగది డైనింగ్ హాల్ స్టోర్ రూమ్ టాయిలెట్స్ వాష్ ఏరియా అలాగే స్కూల్ పరిసరాలను పరిశీలించారు. కేజీబీవీ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ పాఠశాల. కస్తూర్బా గాంధీ ప్రిన్సిపాల్ సుమలత పంచాయతీ కార్యదర్శి రవికుమార్. తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ విజయ చందర్ రెడ్డి



మీ వార్త పరకాల ప్రతినిధి

పరకాల రూరల్ మండలం కామారెడ్డి పల్లి గ్రామం లో బీజేపీ సీనియర్ నాయకులు కొమ్మిడి మహేందర్ రెడ్డి అమ్మ కొమ్మిడి కాంతమ్మ గా ఇటీవల అనారోగ్యం తో మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పెసరు విజయచందర్ రెడ్డి . ఈ కార్యక్రమం లో పరకాల మండల అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, బీజేపీ నాయకులు తండ కుమారస్వామి, ఎదునూరి లింగయ్య, చిర్ర చక్రపాణి,మల్లారెడ్డి, జన్ను లింగయ్య, ప్రమోద్ కుమార్, కొమురయ్య,తడుక సురేష్, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు....

## ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో పాల్గొన్న పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ

మీ వార్త పరకాల ప్రతిజ్ఞ



సనాతన ధర్మంతో పాటు పవిత్ర సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పే అద్వితీయ ఆధ్యాత్మిక క్షణం... మహా కుంభమేళ సంఘములో పవిత్ర స్నానం ఆచరించిన... భక్తి సాంస్కృతి సమైక్యతను ప్రత్యేకంగా ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాలో పాల్గొని పుణ్య స్థానాలు చేసి మొక్కులు తీర్చుకున్న పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల సోదా రామకృష్ణ మరియు వాల్మీకి రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి పి ఎ సి స్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, మార్క జితేందర్ తదితరులు పాల్గొన్నారు



## గుట్టు చప్పుడు కాకుండా గుడిసెలతొలగింపు

మంచిర్యాల. జన్నారం: మీ వార్త

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కొత్తూరు పల్లె గ్రామ శివారులో గడ్డేమ్ గూడెంలో గిరిజనులు గత 30 సంవత్సరాలనుండి పోడుభూమిని సాగు చేసుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని గిరి జనంపై ఎలాంటి సమాచారం లేకుండా రాత్రి రెండుగంటల సమయంలో అటవీధికారులు ఒక్కసారిగా జేసీబీ, ట్రాక్టర్లతో విరుచుకు పడి గుడిచెలను తొలగించారు .ఇళ్లను తొలగించడంతో గిరిజనులు ఆవేదన చెందుతు గత 25 30 సంవత్సరాల నుండి జీవితాన్ని కొన సాగిస్తున్న మమ్ములను అటవీ అధికార్లు అటవీ ఆంక్షలతో ఇలా ఇళ్లను తొలగించడం ఎంతవరకు సమంజసం అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రని ఎండలో పిల్లాపాపలతో చెట్ల కింద బ్రతుకు జీవనాన్ని గడుపుతున్నామని మా ఆవేదనను ప్రభుత్వ అధికారులు అర్థం చేసుకొని మాకు న్యాయం చేయవలసిందిగా అధికారులను వేడుకుంటున్నాము.

## పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్ రెడ్డిని గెల్పించండి



ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్.

మంచిర్యాల జన్నారం :మీ వార్త

జన్నారం మండలంలో కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని పట్టభద్రుల కాంగ్రెస్ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డిని బాజీ మెజారిటీతో గెలిపించాలని అన్నాడు. నియోజకవర్గంలోని మొత్తం మండలాలను పర్యటించడం జరిగిందని అన్నారు మొత్తం పట్టభద్రుల ఓట్లు 1494 ఉన్నాయని అందులో మనకు ఏడు నుంచి ఎనిమిది వందల పైచిలుకు ఓట్లు వస్తాయని మనకు అనుకూలంగా ఓటు వేసే అభ్యర్థులను గ్రీన్ జోన్ గా,ఎటు వేయకుండా ఉండేటువంటివారిని ఎల్లో జోన్ గా,మనకు ఓటు వేయని వారిని రెడ్ జోనుగా ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ ముజఫర్ అలీ ఖాన్, జిల్లా నాయకులు మోహన్ రెడ్డి గారు,రాజశేఖర్ రెడ్డి గారు, సుభాష్ రెడ్డి గారు,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దగట్టు లింగమంతుల స్వామివారి జాతరలో ఎమ్మెల్సీ కవిత పాల్గొని చౌడమ్మ తల్లికి బోనం సమర్పించారు

మీ వార్త సూర్యాపేట జిల్లా ప్రతినిధి షేక్ జహీర్

లింగమంతుల స్వామి వారిని దర్శించుకున్న అనంతరం సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 199 టీఎంసీలతో బనకచర్లలో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని, అనుమతుల కోసం ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ మన ముఖ్యమంత్రి మాత్రం కనీసం నాగార్జున సాగర్ ను కూడా మన ఆధీనంలోకి తీసుకురాలేకపోయారని విమర్శించారు. కాళేశ్వరం ద్వారా సూర్యాపేట జిల్లాలో కేసీఆర్ గోదావరి జలాలను పారించారని, కృష్ణా పరివాహక ప్రాంతంలోనూ గోదావరి నుంచి నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్ దని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో కోదాడ నియోజకవర్గానికి కాళేశ్వరం ద్వారా లక్షా 22 వేల ఎకరాలకు నీళ్లు అందించారని వివరించారు. ఇప్పుడు నీళ్లు ఎందుకు తేవడం లేదని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. ఇప్పుడు నీళ్లు ఎందుకు తేవడం లేదో చెప్పాలని మంత్రి ఉత్తమ్ కు సవాలు విసిరారు. రాజకీయ కక్షతోనే మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగించడం లేదని ఇంజనీర్లు చెబుతున్నారని చెప్పారు. మరో 40 రోజుల పాటు నీళ్లు ఇస్తేనే పంటలు చేతికొచ్చే అవకాశం ఉంటుందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నీళ్లు ఇవ్వడం లేదని ఎండగట్టారు. పోయిన ఏడు నీళ్లు ఇవ్వక సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో 4 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని, నీళ్లు ఇస్తామని చెప్పి ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్లనే అప్పుడు పంటలు ఎండిపోయాయని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయంటే ఆ పాపం, ఉసురు మంత్రి ఉత్తమ్ కు తగులుతుందని స్పష్టం చేశారు. జిల్లా మంత్రియే కాకుండా సాగునీటి శాఖ మంత్రిగా ఉండి ఈ ప్రాంతానికి నీళ్లు ఇవ్వని మంత్రి ఉన్నా ఒకటే లేకున్నా ఒకటేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజంతా కేసీఆర్ ను తిట్టుకుంటూ తిరిగితే కాంగ్రెస్ నాయకులకు ఒరిగేదేమీ లేదని, ప్రజల కోసం పని చేయాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. కేసీఆర్ ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల ప్రేమతో పరిపాలించారని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఏ ఒక్క అంశంపై ఆలోచన చేయకుండా పాలిస్తున్నారని చెప్పారు. “14 నెలల్లో 30 సార్లు రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. ఎవరు ఏమనుకున్నా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దల కాళ్లు పట్టుకుంటా అన్నట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారు. మహిళలకు ఒక్క కార్యక్రమాన్ని కూడా చేయని కాంగ్రెస్ ప్రభుత్వం. మహిళల అంశాలపై ముఖ్యమంత్రి కనీసం ఒక సమీక్ష చేయలేదు. మహిళలకు ప్రభుత్వం ఏమి చేయలేదు. ఏం చేశారో చెప్పడానికి ప్రభుత్వ పెద్దలు చర్చకు రావాలి” అని సవాలు చేశారు. కేసీఆర్ హయాంలో మహిళలకు పెద్దపీట వేశామని, మహిళా అభివృద్ధి, సంక్షేమం కోసం కేసీఆర్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.



కేసీఆర్ హయాంలో మహిళలపై నేరాలు చేయాలంటే వెన్నులో వణుకుపుట్టేదని, కానీ ఇప్పుడు రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో మతకల్లోలం లేని ప్రాంతమే లేదని, కాంగ్రెస్ పార్టీ పాలనలో శాంతి భద్రతల సన్నగిల్లాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఏ వర్గానికి కాంగ్రెస్ చేసిందేమీ లేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ కోసం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎస్సీ, బీసీల జనాభాను తక్కువ చేసి చూపిస్తున్నదని ఎత్తిచూపారు.
గందరగోళం.. కాకిలెక్కలతో సీఎం రేవంత్ రెడ్డి కాలం వెల్లదీస్తున్నారని మండిపడ్డారు.
బీఆర్ఎస్ పార్టీ గల్లా పట్టుకొని అడిగితే రైతు రుణమాఫీని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ ఎవరికీ సంపూర్ణంగా రుణ మాఫీ కాలేదని చెప్పారు. రైతుభరోసా ఒక్కో గ్రామంలో సగం మంది రైతులకు కూడా రాలేదని అన్నారు. రైతులను కూడా మోసం చేస్తూ రేవంత్ రెడ్డి పైశాచికానందం పొందుతున్నారని విరుచుకుపడ్డారు.
లిచౌడమ్మ తల్లికి బోనం సమర్పించిన ఎమ్మెల్సీ కవిత
పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా చౌడమ్మ తల్లికి కవిత బోనం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. బోనం ఎత్తుకుని ఆలయం వద్దకు చేరుకున్న కవితకు పూజారులు ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం ఆశీర్వచనం అందించారు
ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు లింగమంతుల జాతర శుభాకాంక్షలు తెలిపారు. చౌడమ్మ తల్లికి బోనం చెల్లించడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. సమ్మక్క సారక్క జాతర తరువాత రెండో అతి పెద్దదైన లింగమంతుల జాతర తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనంగా నిలుస్తుంది అని తెలిపారు. కేసీఆర్ హయాంలో జాతరకు రూ.14 కోట్ల నిధులు కేటాయించి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. ఈ ప్రభుత్వం కూడా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నాం అని కవిత పేర్కొన్నారు.

# కవితక్క... కేరాఫ్ సిద్ధిపేట..



**మెదక్ :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న కవిత జైలు నుండి బెయిల్ పై బయటకు వచ్చారు. కొద్దిరోజులు పార్టీ స్థితిగతులు అంచనా వేసిన కవిత, ఆ తర్వాత స్పీడ్ పెంచారు. కవితకు బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ లో స్పెషల్ క్రేజ్ ఉంది. పార్టీ క్యాడర్ కూడా ఆమెకిచ్చే గౌరవంలో ఏమాత్రం తక్కువ చేయరు. ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టడంలో ఎవరైనా కవిత తర్వాతే అంటారు పార్టీ క్యాడర్. అయితే ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలను బట్టి కవిత.. కాస్త బీఆర్ఎస్ అధినాయకత్వానికి భిన్నంగా నడుచుకుంటున్నారని ప్రచారం సాగుతోంది. పలు విషయాలతో విభేదిస్తూ.. తన పని తాను కవిత చేసుకుపోతున్నారట.ఇటీవల శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వాకౌట్ చేసినప్పటికీ కవిత మాత్రం సభలో ఉండిపోయారు. అంతేకాదు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణన సర్వేలో కేసీఆర్, కేటీఆర్ పాల్గొనలేదు. కవిత మాత్రం సర్వేలో పాల్గొని తన వివరాలు అందజేశారు. దీనితో మంత్రులు కూడా కవిత సర్వేలో పాల్గొంది.. మీకేమైంది అంటూ కేటీఆర్, కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. ఇలా కొన్ని అంశాలలో కవిత తనకంటూ ప్రత్యేకత చాటుకుంటూ.. తనకు ఉన్న ఇమేజ్ ను పెంచుకుంటూ పోతున్నారని టాక్.కాగా ఇటీవల సిద్ధిపేటపై కవిత ఫోకస్ పెట్టారని బీఆర్ఎస్ క్యాడర్ భావిస్తోంది. సిద్ధిపేట నుండి మాజీ మంత్రి హరీష్ రావు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. హరీష్ స్వయాన వరుసకు కవితకు బావ అవుతారు. కేసీఆర్ కుటుంబానికి సమీప బంధువైన హరీష్ రావుకు, కేటీఆర్, కవితలకు మనస్పర్థలు ఉన్నాయని పలుమార్లు వదంతులు వ్యాపించాయి. ఇలాంటి తరుణంలో కవిత ఇటీవల స్పీడ్ పెంచి ఎక్కువగా సిద్ధిపేట నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. పార్టీలో తనకంటూ బ్రాండ్ ఇమేజ్ ఉన్న కవిత కన్ను సిద్ధిపేటపై పడిందని, రానున్న ఎన్నికల్లో కవిత పోటీ ఇక్కడి నుండే అంటూ ప్రచారం సాగుతోంది.అలాగే జగిత్యాల నుండి పోటీ చేస్తారని కూడా మరో ప్రచారం సాగుతోంది. కానీ హరీష్ రావుకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే సిద్ధిపేటలో కవిత తరచూ పర్యటిస్తున్నారని, రానున్న ఎన్నికలకు ఇప్పటినుండే రూట్ వేస్తున్నట్లు కొందరి అభిప్రాయం. అదే నిజమైతే హరీష్ రావు నెక్ట్స్ పోటీ ఎక్కడి నుండి సాగుతుందనే కోణంలో కూడా చర్చలు సాగుతున్నాయి. మొత్తం మీద మీడియా ముందు మేమంతా ఒకటే అనే నినాదం అంటూ వీరు ప్రచారం సాగిస్తున్నప్పటికీ, విభేదాలు ఉన్నాయ్.. అందుకే సిద్ధిపేటపై కవిత ఫోకస్ అంటూ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి ఈ ప్రచారంలో ఎంత మేరకు వాస్తవం ఉందో కానీ, మొత్తం మీద కవిత దెబ్బకు హరీష్ రావు అనుచరులు ఏ క్యాహై అనేస్తున్నారట.

# ఫ్లై ఓవర్లు కింద గేమింగ్ జోన్స్

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కొత్తగా ఫ్లైఓవర్లు నిర్మించిన సంగతి తెలిసిందే. చాలా ప్రాంతాల్లో కొత్తగా ఫ్లైఓవర్లు నిర్మించారు. కొన్ని ఏరియాల్లో అయితే కి.మీ పొడవునా వీటిని ఏర్పాటు చేశారు. అయితే ఈ ఫ్లైఓవర్ల కింద చాలా విశాలమైన స్థలాలు ఉన్నాయి. ప్రస్తుతం అవి నిరూపయోగంగా ఉండగా.. మల్టీ పర్పస్‌గా వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఎక్కువ వెడల్పు ఉన్న పైవంతెనలను జీహెచ్ఎంసీ అధికారులు గుర్తిస్తున్నారు. ఇప్పటికే షేక్‌పేట ఫ్లైఓవర్‌ను క్రీడా మైదానంలా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.ప్రస్తుతం చాలా కాలనీలకు పార్కులు, ఆట స్థలాల కొరత ఉండగా.. దాన్ని కొంత వరకైనా భర్తీ చేసేందుకు.. ఫ్లైఓవర్ల కింద ఉండే స్థలాన్ని ఉపయోగించుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సీఎం సూచనల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు నగరంలోని ఫ్లైఓవర్లపై అధ్యయనం చేస్తున్నారు. ఎక్కడైతే మల్టీపర్పస్‌గా వినియోగించుకోవటానికి వీలుటుందో వాటిపై అధ్యయనం చేస్తున్నారు. షేక్‌పేట పైవంతెన మొ?త్తం పొడవు 2.5కి.మీ కాగా, 24మీటర్ల వెడల్పుతో దీన్ని నిర్మించారు. 24 మీటర్ల వెడల్పుతో ఫ్లైఓవర్ కింద ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించారు. సీఎం ఆదేశాల మేరకు అక్కడ పార్కు, గేమింగ్ జోన్ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.ఇక ఆరాంఘర్-జూపార్కు కొత్త ఫ్లైఓవర్, జేఎన్‌టీయూ నుంచి మలేషియన్ టౌన్‌షిప్ ఫ్లైఓవర్, కొత్తగూడ కూడలి ఫ్లైఓవర్, లాలాపేట, నాగోల్, కామినేని కూడళ్ల ఫ్లైఓవర్లు కూడా చాలా ఎక్కువ వెడల్పుతో నిర్మించారు. వాటి కింద క్రీడా వసతులు కల్పించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఒకటో పిల్లరు నుంచి రెండో పిల్లరు మధ్య పచ్చదనానికి పాధాన్యం ఇస్తూ మొక్కలు, వాటి చుట్టూ కుర్చీలు, నడక మార్గం ఏర్పాటు చేస్తారు. రెండు, మూడో పిల్లర్ల మధ్య కార్లు, బైకులకు పార్కింగ్ వసతి కల్పిస్తారు. మూడు, నాలుగో పిల్లర్ల మధ్య యోగా సెంటర్, పిల్లల పార్కు, ఓపెన్ జిమ్ వంటివి ఏర్పాటు చేయనున్నారు. నాలుగు, ఐదో పిల్లర్ల మధ్య స్కేటింగ్ రింగ్, ఐదు, ఆరో పిల్లర్ల మధ్య బ్యాడ్మింటన్ కోర్టు, సీటింగ్ ఏరియా ఏర్పాటు చేస్తారు. ఆరు, ఏడో పిల్లర్ల మధ్య బాక్స్ క్రికెట్. ఏడు, ఎనిమిదో పిల్లర్ల మధ్య మొక్కలు, కుర్చీలు. ఏర్పాటు చేస్తారు. ఒకటో పిల్లరు నుంచి ఎనిమిదో పిల్లరును కలుపుతూ అంచుల్లో వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేస్తారు.

## అధైర్య పడకు.. అండగా ఉంటా

**–న్యాయవాది ఇనుముల సతీష్ ను పరామర్శించిన ఐటి మంత్రి శ్రీధర్ బాబు**

**మంథని :** తండ్రి నీ కోల్పోయి దుఃఖంలో ఉన్న మంథని మాజీ ఉపసర్పంచ్, ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇనుముల సతీష్ ను మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించ్చారు. అధైర్య పడకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఇనుముల సతీష్ తండ్రి ఇనుముల శంకరయ్య గత ఆరు రోజుల క్రితం మృతి చెందగా సోమవారం రాత్రి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇనుముల సతీష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సతీష్ తండ్రి శంకరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు పోలు శివ, నాయకులు శశిభూషణ్ కాచే ఉప్పట్ల శ్రీనివాస్, ఆకుల కిరణ్, మూల పురుషోత్తం రెడ్డి, నాంపల్లి సతీష్ లతో పాటు పలువురు పాల్గొన్నారు/

## న్యాయస్థానం ఆదేశాలను తక్షణమే అమలు చేయాలి

**గురుకుల అభ్యర్థుల డిమాండ్**

**హైదరాబాద్ :** న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి తమకు న్యాయం చేయాలని గురుకుల అభ్యర్థులు ప్రజాభవన్ వద్ద బైఠాయించారు. భారీగా తరలివచ్చిన అభ్యర్థులు నేరుగా ప్రజాభవానికి చేరుకొని మెట్లపై కూర్చొని తమ నిరసనను తెలియజేస్తున్నారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాపాలన అందిస్తామన్న కాంగ్రెస్ హామీని నమ్మి అన్ని వర్గాల ప్రజలు అధికారంలోకి తీసుకొస్తే ఇలా వ్యవహరించడం ఏమిటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయస్థానం ఆదేశాలను అమలు చేసి గురుకుల అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

## కీసర ఆలయంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు

**అధికారుల సమీక్షా సమావేశం**

**మేడ్చల్ :** కీసర గుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్ట లో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ 26 నుండి మార్చ 1 వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అధికారులు అందరూ కలిసి సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని అన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కావలసిన ఏర్పాట్లు అధికారులు చేయాలని సూచించారు. ఎండలు ఉం డడం వలన భక్తుల కోసం చల్వ పందిర్లు , మంచినీరు మజ్జిగ ఏర్పాటు చేయాలని అన్నారు.

# బిజినెస్

## ఎల్ఐసి నుంచి మరో అద్భుతమైన పెన్షన్ స్కీమ్



ప్రభుత్వ రంగ ఎల్ఐసి నికర ప్రీమియం ఆదాయం తాజా మూడవ త్రైమాసికంలో 9% తగ్గి రూ.1.07 లక్షల కోట్లకు చేరుకుంది. దీనికి సింగిల్ ప్రీమియం వసూళ్లలో 24% తగ్గుదల, మొదటి సంవత్సరం ప్రీమియం వసూళ్లలో 14% క్షీణత కారణమైంది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తన కొత్త ప్లాన్ ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్‌ను ప్రారంభించినట్లు అధికారికంగా ప్రకటించింది. ఇది ఫిబ్రవరి 18, 2025 నుండి ఇది అందుబాటులో ఉంటుంది. 'స్మార్ట్ పెన్షన్' ప్లాన్ అనేది 'నాన్-పార్టిసిపేటింగ్, నాన్-లింక్డ్, ఇండివిజువల్/గ్రూప్, సేవింగ్స్, ఇమ్మీడియట్ యాన్యుటీ ప్లాన్. ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్, భారతదేశంలో పెన్షన్, పదవి విరమణ పొదుపు మార్కెట్‌లో ×జ నాయకత్వ స్థానాన్ని మరింత బలపరిచే అవకాశం ఉంది. జనాభా పెరుగుతుండగా, వారు తమ ఆర్థిక భవిష్యత్తును భద్రపరచుకోడానికి మార్గాలను అన్వేషిస్తున్నారు. అందులో పెన్షన్ ప్రోగ్రాములు ఒక ముఖ్యమైన భాగంగా మారుతున్నాయి. దీని గురించి మరిన్ని వివరాలు అందించనున్నాము.డ్రాప్ డౌన్ జాబితా నుండి తగిన డాక్యుమెంట్ రకాన్ని ఎంచుకోవడం ద్వారా ధృవీకరణ కోసం మీ పత్రాలను స్కాన్ చేసి అప్‌డేట్ చేయండి. ఆ తర్వాత మీకు సర్వీస్ రిక్వెస్ట్ నంబర్ వస్తుంది. ఈ నంబర్‌తో మీరు ఈ పోర్టల్ నుండి అప్‌డేట్ స్థితిని తెలుసుకోవచ్చు. ప్రభుత్వ రంగ ఎల్ఐసి నికర ప్రీమియం ఆదాయం తాజా మూడవ త్రైమాసికంలో 9% తగ్గి రూ.1.07 లక్షల కోట్లకు చేరుకుంది. దీనికి సింగిల్ ప్రీమియం వసూళ్లలో 24% తగ్గుదల, మొదటి సంవత్సరం ప్రీమియం వసూళ్లలో 14% క్షీణత కారణమైంది. డిసెంబర్ త్రైమాసికంలో ఉద్యోగుల పరిహారం, సంక్షేమ ఖర్చులు దాదాపు మూడింట ఒక వంతు తగ్గడంతో ఎల్ఐసీ ఇప్పటికీ పన్ను తర్వాత లాభంలో 17% పెరుగుదల రూ. 11,056 కోట్లను నమోదు చేసింది.

## మార్చిలో టీసీఎస్‌లో శాలరీ పెంపు

భారత్‌లో అతిపెద్ద ఐటీ రంగ సంస్థ టీసీఎస్ ఉద్యోగుల శాలరీలు పెంచేందుకు రెడీ అయ్యింది. మార్చిలో జీతాల్లో పెంపు ఉంటుందని తెలుస్తోంది. ఈ మేరకు ఏప్రిల్ నుంచి ఉద్యోగులు పెరిగిన జీతాలు అందుకోనున్నారు. అయితే, శాలరీ పెంపు ఈ మారు 4 నుంచి 8 శాతం మధ్య ఉంటుందని సమాచారం. "శాలరీ పెంపు సమాచారం మాకు అందింది. ఈ సారి 4 – 8 శాతం మధ్య ఉంటుందని తెలిపారు. ఈసారి శాలరీ పెంపు తక్కువగానే ఉందని చెప్పకతప్పదు" అని ఓ ఉద్యోగి జాతీయ మీడియాకు తెలిపారు. 2022 ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్ ఉద్యోగుల శాలరీలు సగటున 10.5 శాతం మేర పెరిగాయి. కానీ గత ఆర్థిక సంవత్సరంలో మాత్రం ఇది 7–9 శాతానికి పడిపోయింది. ఇక భారతీయ టాప్ ఐటీ కంపెనీలు అన్నింటిలో ఈసారి జీతాల పెంపు ఓమోస్తరు స్థాయిలోనే ఉండనుంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికరంగంలో ఒడిదుడుకులు భారతీయ ఐటీ రంగంపై పడటమే ఇందుకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. కొవిడ్ సంక్షోభ సమయంలో భారతీయ ఐటీ ఉద్యోగులు అత్యధిక స్థాయిలో శాలరీల పెంపు పొందిన విషయం తెలిసిందే. మరోవైపు, భారత్‌లో రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ శాలరీ పెంపునకు సంబంధించి ఫిబ్రవరి చివరికల్లా ఉద్యోగులకు సమాచారం ఇవ్వనుంది. ఇన్ఫోసిస్‌లో శాలరీ పెంపు 5 నుంచి 8 శాతం వరకూ ఉండొచ్చని అంచనా. ఇక టీసీఎస్‌లో ప్రస్తుతం ఆరు లక్షల పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. ఈ మార్చి నెలాఖరు కల్లా మరో 40 వేల మంది ఫ్రెషర్లను నియమించుకునేందుకు టీసీఎస్ యోచిస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఇంతకంటే ఎక్కువ మందిని నియమించుకోవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇక టీసీఎస్‌లో శాలరీ పెంపు, వేరియబుల్ పేఔట్ చెల్లింపులు ఉద్యోగుల రిటర్న్ టూ ఆఫీస్ లింక్ చేసినట్టు కూడా తెలుస్తోంది.

# భారీగా పెరుగుతున్న బంగారం దిగుమతులు



బంగారం దిగుమతుల పెరుగుదల జనవరిలో దేశ వాణిజ్య లోటు (దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసం) వి23 బిలియన్లకు చేరుకుంది. చైనా తర్వాత భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు దేశం. దిగుమతులు ప్రధానంగా ఆభరణాల పరిశ్రమ అవసరాల కోసమే. జనవరిలో దేశంలో బంగారం దిగుమతులు 40.79 శాతం పెరిగి 2.68 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దేశీయ డిమాండ్ పెరగడం వల్ల బంగారం దిగుమతులు పెరిగాయి. ఈ సమాచారం వాణిజ్య మంత్రిత్వ శాఖ డేటా నుండి అందింది. ఒక సంవత్సరం క్రితం జనవరి 2024లో బంగారం దిగుమతులు వి1.9 బిలియన్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-జనవరి కాలంలో బంగారం దిగుమతులు 32 శాతం పెరిగి 50 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 37.85 బిలియన్ డాలర్లుగా ఉంది. దిగుమతుల పెరుగుదల ఈ విలువైన లోహాన్ని సురక్షితమైన ఆస్తిగా పెట్టుబడిదారుల బలమైన విశ్వాసాన్ని కూడా సూచిస్తుంది. ప్రపంచ అనిశ్చితుల కారణంగా పెట్టుబడులను వైవిధ్యపరచడానికి బంగారంలో పెట్టుబడి పెట్టడం, బ్యాంకుల నుండి డిమాండ్, కస్టమ్ డ్యూటీ తగ్గింపు ఇతర కారణాలు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధర 11 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.88,200కి చేరుకుంది. 2023–24లో భారతదేశ బంగారం దిగుమతులు 30 శాతం పెరిగి వి45.54 బిలియన్లకు చేరుకున్నాయి. బంగారం దిగుమతులు దేశ కరెంట్ అకౌంట్ లోటుపై ప్రభావం చూపుతాయి. బంగారం దిగుమతులలో స్విట్జర్లాండ్ అతిపెద్ద వనరుగా ఉంది. దీని వాటా దాదాపు 40 శాతం. దీని తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (16 శాతం కంటే ఎక్కువ), దక్షిణాఫ్రికా (సుమారు 10 శాతం) ఉన్నాయి. దేశం మొత్తం దిగుమతుల్లో ఈ విలువైన లోహం వాటా ఐదు శాతం కంటే ఎక్కువ. బంగారం దిగుమతుల పెరుగుదల జనవరిలో దేశ వాణిజ్య లోటు (దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసం) వి23 బిలియన్లకు చేరుకుంది. చైనా తర్వాత భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు దేశం. దిగుమతులు ప్రధానంగా ఆభరణాల పరిశ్రమ అవసరాల కోసమే. గత నెలలో రత్నాలు, ఆభరణాల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 15.95 శాతం పెరిగి దాదాపు 3 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. జనవరిలో దేశంలో వెండి దిగుమతులు 82.84 శాతం పెరిగి 883.2 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

## సామాన్యుడి కారు ధరకు రెక్కలు.. రేటు పెంచేసి షాక్ ఇచ్చిన కంపెనీ



దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న కార్ల జాబితాలో మారుతీ సుజుకి కంపెనీ తయారు చేసిన వ్యాగన్ ఆర్ తప్పనిసరిగా ఉంటుంది. కొన్నేళ్లుగా ఆటో మార్కెట్ లో దీని విక్రయాలు స్థిరంగా జరుగుతున్నాయి. కాలానుగుణంగా ఈ కారులో వివిధ మార్పులను తీసుకువచ్చారు. మారుతీ సుజుకీ వ్యాగన్ ఆర్ పాత ధర కంటే దాదాపు రూ.15 వేలు పెంచింది. కాగా.. ఈ పెరుగుదల మోడల్, వేరియంట్ ఆధారంగా రూ.32,500 వరకూ ఉంటుంది. మారుతీ సుజుకి వ్యాగన్ ఆర్ నాలుగు వేరియంట్లు, తొమ్మిది రకాల విభిన్న రంగులలో అందుబాటులో ఉంది. 1.0 లీటర్, 1.2 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోలు ఇంజిన్లతో లభిస్తుంది. ట్రాన్స్ మిషన్ ఎంపిక ల్లో ఐదు స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్, ఏఎంటీ ఏర్పాటు చేశారు. పెట్రోలు – సీఎన్ జీ ఇంధన వేరియంట్ ను కూడా మార్కెట్ లోకి తీసుకువచ్చారు. 1.0 లీటర్ పెట్రోలు మోటారు నుంచి 55.92 బీహెచ్పీ గరిష్ట శక్తి, 92.1 ఎన్ఎం అధిక టార్క్ విడుదల అవుతుంది. అలాగే 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ నుంచి 88.5 బీహెచ్పీ, 113 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి అవుతుంది. ఇంజిన్ వేరియంట్లకు అనుగుణంగా లీటర్ కు సుమారు 24 నుంచి 25 కిలోమీటర్ల మైలేజీ అందిస్తుంది. మారుతీ సుజుకి వ్యాగర్ ఆర్ ధర రూ.15 వేల వరకూ పెరిగింది. వీఎక్స్ఐ 1.0 ఏజీఎస్, జెడ్ ఎక్స్ఐ 1.2 ఏజీఎస్, జెడ్ ఎక్స్ ప్లస్ 1.2 ఏజీఎస్, జెడ్ ఎక్స్ ఐ ప్లస్ ఏజీఎస్ డ్యూయల్ టోన్ వేరియంట్లకు ఈ పెరుగుదల వర్తిస్తుంది. మిగిలిన అన్ని రకాల వేరియంట్లకు రూ.పది వేల చొప్పున పెరుగుదల నెలకొంది. పెరిగిన ధరల ప్రకారం ఆ కార్ల ధరలు (ఎక్స్ ఫోరూమ్) ఇలా ఉన్నాయి. బేస్ వేరియంట్ (ఎల్ఎక్స్ఐ) రూ.5.64 లక్షలు, వీఎక్స్ఐ రూ.6.09 లక్షలు,జెడ్ ఎక్స్ఐ రూ.6.38 లక్షలు,ఎల్ఎక్స్ఐ సీఎన్జీ రూ.6.54 లక్షలు,వీఎక్స్ఐ ఏజీఎస్ రూ.6.59 లక్షలు,జెడ్ఎక్స్ఐ ప్లస్ రూ.6.85 లక్షలు,జెడ్ఎక్స్ఐ ఏజీఎస్ రూ.6.88 లక్షలు,ఎల్ఎక్స్ఐ సీఎన్జీ రూ.6.99 లక్షలు,జెడ్ఎక్స్ఐ ప్లస్ ఏజీఎస్ రూ.7.35 లక్షలు, మారుతీ వ్యాగన్ ఆర్ కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అలాగే అనేక ప్రధాన కంపెనీల వాహనాలతో పోటీ పడుతోంది. వీటిలో మారుతీ సెలెరియా, ఎస్ ప్రెస్సో, రెనాల్ట్ క్విడ్, హ్యుందాయ్ గ్రాంట్ నియోస్ ఐ10 వంటి హ్యాచ్ బ్యాక్ కార్లు ఉన్నాయి. అలాగే టాటా పంచ్, నిస్సాన్ మాగ్నైట్, రెనాల్ట్ కిగర్ వంటి ఎస్ యూవీలతో కూడా పోటీ నెలకొంది. వాహనాల తయారీ ఖర్చులు పెరగడం, మార్కెట్ వ్యూహాలు తదితర అంశాలు ధరలను పెంచడానికి కారణమని చెప్పవచ్చు.

## బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు భారత తుదిజట్టు ఇదే!

# రోహిత్ కోరుకుంటేనే అతడికి ఛాన్స్



చాంపియన్స్ ట్రోఫీ-2025 టోర్నమెంట్‌కు టీమిండియా పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ మెగా ఈవెంట్లో టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగనున్న రోహిత్ సేనకు లీగ్ దశలోని మూడు మ్యాచ్‌లు కీలకమే. ఇందులో ఒక్కటి ఓడినా సెమీ ఫైనల్ చేరే అవకాశాలపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఈ నేపథ్యంలో తుదిజట్టు ఎంపిక విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మూల్యం చెల్లించాల్సి వస్తుందంటున్నాడు భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా టీమిండియా ఈ టోర్నీలో ఆడబోయే తొలి మ్యాచ్‌కు తన ప్లేయింగ్ ఎలెవన్ ఇదేనంటూ యూట్యూబ్ వేదికగా అభిప్రాయాలు పంచుకున్నాడు.

**పేసర్ల విభాగంలో మాత్రం**

జట్టులో ఇద్దరు స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్లతో పాటు ఓ స్పెషలిస్టు స్పిన్నర్ తప్పక ఉంటాడన్న ఆకాశ్ చోప్రా.. అయితే, ఈ విషయంలో కెప్టెన్, హెడ్‌కోచ్ ఎవరివైపు మొగ్గుచూపుతారన్నది చెప్పడం కాస్త కష్టమేనని పేర్కొన్నాడు. ఇక పేసర్ల విభాగంలో మాత్రం మొదటి ప్రాధాన్య ఆటగాడిగా అర్ష్‌దీప్ సింగ్‌కు తప్పక స్థానం దక్కుతుందని అంచనా వేశాడు. కాగా 2017 తర్వాత తొలిసారిగా చాంపియన్స్ ట్రోఫీ జరుగనుంది. పాకిస్తాన్ వేదికగా ఈ వన్డే ఫార్మాట్ టోర్నీ మొదలుకానుండగా... టీమిండియా మాత్రం తమ మ్యాచ్‌లు దుబాయ్‌లో ఆడనుంది. ఇందులో భాగంగా గురువారం(ఫిబ్రవరి 20) రోహిత్ సేన తమ తొలి మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-'ఎ'లో ఉన్న బంగ్లాదేశ్‌తో తలపడనుంది. ఈ నేపథ్యంలో భారత తుదిజట్టు కూర్పు గురించి ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. "రోహిత్ శర్మ- శుబ్‌మన్ గిల్.. కెప్టెన్, వైస్ కెప్టెన్.. ఓపెనర్లుగా వీరే ఉంటారు. ఇక వన్‌డౌన్ బ్యాటర్ గురించి సందేహాలు అక్కర్లేదు. రన్ మెషీన్ కోహ్లి మూడో స్థానంలో వస్తాడు. ఇక నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్ ఆడతాడు. నా అభిప్రాయం ప్రకారం.. అక్షర్ పటేల్ ఐదు, కేఎల్ రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేస్తారు. హార్దిక్ పాండ్యా ఏడు.. రవీంద్ర జడేజా ఎనిమిదో స్థానంలో ఆడతారు. ఒకవేళ రోహిత్ శర్మ కోరుకుంటే కుల్దీప్ యాదవ్ తుదిజట్టులో ఉంటాడు.

**నా ఓటు కుల్దీప్ యాదవ్‌కే**

అలా కాకుండా గంభీర్ తన నిర్ణయానుగుణంగానే వెళ్లాలనుకుంటే మాత్రం వరుణ్ చక్రవర్తికి అవకాశం వస్తుంది. అయితే, నేను మాత్రం కుల్దీప్ యాదవ్‌కే ఓటు వేస్తాను. ఇక నా జట్టులో అర్ష్‌దీప్ సింగ్ తప్పక ఉంటాడు. అతడికి తోడుగా మహ్మద్ షమీ తుదిజట్టులో ఉంటే పర్‌ఫెక్ట్‌గా ఉంటుంది. ఒకవేళ అలాగాక హర్షిత్ రాణాను పిలిపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మిడిల్, డెత్ ఓవర్లలో అతడు చక్కగా రాణించగలడు" అని పేర్కొన్నాడు. దుబాయ్ పిచ్‌లకు అనుగుణంగా టీమిండియా బ్యాటర్లు క్రీజులో కాస్త ఎక్కువ సమయం గడిపితేనే భారీ స్కోర్లు చేయగలిగే ఆస్కారం ఉంటుందని ఆకాశ్ చోప్రా ఈ సందర్భంగా అభిప్రాయపడ్డాడు. చాంపియన్స్ ట్రోఫీ-2025: టీమిండియా వర్సెస్ బంగ్లాదేశ్ మ్యాచ్‌కు ఆకాశ్ చోప్రా ఎంచుకున్న భారత తుదిజట్టు రోహిత్ శర్మ(కెప్టెన్), శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్/వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ షమీ/హర్షిత్ రాణా.

## ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు మరో బిగ్ వికెట్ డౌన్



ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు మరో పెద్ద వికెట్ పడింది. న్యూజిలాండ్ స్టార్ పేసర్ లోకీ ఫెర్గూసన్ గాయం కారణంగా మెగా టోర్నీకి దూరమయ్యాడు. ఫెర్గూసన్ కుడికాలి పాదంపై గాయమైంది. ఫెర్గూసన్ ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనడంపై ముందు నుంచి అనుమానంగా ఉండింది. ప్రస్తుతం అదే నిజమైంది. ఫెర్గూసన్ ఛాంపియన్స్ ట్రోఫీ మొత్తానికి దూరం కానున్నాడని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఫెర్గూసన్‌కు రీప్లేస్‌మెం ట్‌గా కైల్ జేమీసన్‌ను ఎంపిక చేశారు న్యూజిలాండ్ సెలెక్టర్లు. గాయాల కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమైన 11వ ప్లేయర్ ఫెర్గూసన్. ఇదివరకే స్టార్ ప్లేయర్లు పాట్ కమిన్స్, జోష్ హాజిల్‌వుడ్, జస్ప్రీత్ బుమ్రా, మిచెల్ స్టార్క్, అన్రిచ్ నోర్జే, గెరాల్డ్ కొయెట్జీ, సైమ్ అయూబ్, జేకబ్ బేతెల్, అల్లా ఘజన్‌ఫర్, బెన్ సియర్స్ గాయాల కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యారు. స్టార్ ఆటగాళ్లు.. ముఖ్యంగా పేసర్లు దూరం కావడంతో మెగా టోర్నీ కళ తప్పే అవకాశముంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు గాయం బారిన పడిన రెండో ఆటగాడు ఫెర్గూసన్. కొద్ది రోజుల ముందు పేసర్ బెన్ సియర్స్ కూడా గాయం బారిన పడ్డాడు. అతని స్థానంలో జేకబ్ డఫీ జట్టులోకి వచ్చాడు. తాజాగా ఫెర్గూసన్ కూడా గాయపడటంతో న్యూజిలాండ్ పేస్ విభాగం బలహీనపడినట్లు కనిపిస్తుంది. ఆ జట్టు పేస్ విభాగంలో మ్యాట్ హెన్రీ ఒక్కడే అనుభవజ్ఞుడు. కాగా, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 పాకిస్తాన్, దుబాయ్ వేదికలుగా ఈ నెల 19 నుంచి ప్రారంభం కానుంది. టోర్నీ తొలి మ్యాచ్‌లోనే న్యూజిలాండ్ పాకిస్తాన్‌తో తలపడనుంది. కరాచీలో ఈ మ్యాచ్ జరుగనుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో జరుగనుండగా.. మిగతా మ్యాచ్‌లు పాకిస్తాన్‌లో జరుగుతాయి. ఈ టోర్నీలో భారత్, పాకిస్తాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు గ్రూప్-ఏలో ఉండగా.. గ్రూప్-బిలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ జట్లు పోటీపడుతున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 20న ఆడనుంది. తొలి మ్యాచ్‌లో టీమిండియా.. బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. అనంతరం ఫిబ్రవరి 23న భారత్, పాకిస్తాన్ మ్యాచ్ జరుగనుంది. మార్చి 2న భారత్.. న్యూజిలాండ్‌తో తమ చివరి గ్రూప్ స్టేజీ మ్యాచ్ ఆడుతుంది.

**ఛాంపియన్స్ ట్రోఫీ కోసం న్యూజిలాండ్ జట్టు..**

మార్క్ చాప్‌మన్, విల్ యంగ్, కేన్ విలియమ్సన్, డారిల్ మిచెల్, మైఖేల్ బ్రేస్‌వెల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), నాథన్ స్మిత్, డెవాన్ కాన్వే, టామ్ లాథమ్, విలియమ్ ఓ'రూర్కీ, మ్యాట్ హెన్రీ, జేకబ్ డఫీ, కైల్ జేమీసన్

# స్పోర్ట్స్

## చరిత్ర సృష్టించిన కేరళ క్రికెటర్



అహ్మదాబాద్ వేదికగా గుజరాత్, కేరళ జట్ల మధ్య రంజీ ట్రోఫీ తొలి సెమీఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో కేరళ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేస్తుంది. రెండో రోజు రెండో సెషన్ సమయానికి కేరళ 134.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. వికెట్‌కీపర్ మొహమ్మద్ అజహారుద్దీన్ (105 నాటౌట్), సల్మాన్ నిజర్ (40 నాటౌట్) బ్యాటింగ్ చేస్తున్నారు. కేరళ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ సచిన్ బేబి (69) అ?ర్ధ సెంచరీతో రాణించగా.. అక్షయ్ చంద్రన్, రోహన్ కున్నుమ్మల్, జలజ్ సక్సేనా తలో 30 పరుగులు చేశారు. వరుణ్ నయనార్ 10 పరుగులకు ఔటయ్యాడు. గుజరాత్ బౌలర్లలో అర్జన్ నగస్వల్లా 2, పి జడేజా, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో సెంచరీతో కదంతొక్కిన మొహమ్మద్ అజహారుద్దీన్ రికార్డుబుక్కుల్లోకెక్కాడు. రంజీ సెమీఫైనల్లో సెంచరీ చేసిన తొలి కేరళ ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. రంజీల్లో కేరళ గతంలో ఒకే ఒ?క సారి సెమీస్‌కు చేరుకుంది. 2018–19 సీజన్‌లో కేరళ ఫైనల్ ఫోర్‌కు అర్హత సాధించింది. అయితే ఆ సీజన్ సెమీస్‌లో ఏ కేరళ ఆటగాడు సెంచరీ చేయలేదు. అజహారుద్దీనే రంజీల్లో కేరళ తరఫున సెంచరీ చేసిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ప్రస్తుత రంజీ సీజన్‌లో కేరళ అద్భుతమైన ప్రదర్శనలతో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఎలైట్ గ్రూప్-సిలో కేరళ 7 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 4 డ్రాలతో గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. క్వార్టర్ ఫైనల్లో కేరళ.. జమ్మూ అండ్ కశ్మీర్‌పై ఒక్క పరుగు ఆధిక్యం (తొలి ఇన్నింగ్స్‌లో) సాధించి సెమీస్ బెర్త్ దక్కించుకుంది. మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో విదర్భ, ముంబై జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 383 పరుగులకు ఆలౌటైంది. ముంబై బౌలర్ శివమ్ దూబే ఐదు వికెట్లతో రాణించాడు. షమ్స్‌ములానీ, రాయ్‌స్టన్ డయాస్ తలో రెండు, శార్దూల్ ఠాకూర్ ఓ వికెట్ తీశారు. విదర్భ ఇన్నింగ్స్‌లో ధృవ్ షోరే (74), దినిశ్ మాలేవార్ (79), యశ్ రాథోడ్ (54) అర్ధ సెంచరీలతో రాణించగా.. కరుణ్ నాయర్ (45), కెప్టెన్ అక్షయ్ వాద్కర్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అథర్వ తైడే 4, పార్థ్ రేఖడే 23, హర్ష్ దూబే 18, భూటే 11, యశ్ ఠాకూర్ 3 పరుగులు చేసి ఔట్ కాగా.. దర్శన్ నల్కండే 12 పరుగులతో అజేయంగా నిలిచాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబై.. 18 పరుగుల వద్దే తొలి వికెట్ కోల్పోయింది. దర్శన్ నల్కండే బౌలింగ్‌లో దనిశ్ మలేవార్‌కు క్యాచ్ ఇచ్చి ఆయుశ్ మాత్రే (9) ఔటయ్యాడు. ప్రస్తుతం ఆకాశ్ ఆనంద్ (29), సిద్దేశ్ లాడ్ (19) క్రీజ్‌లో ఉన్నారు. 23 ఓవర్ల అనంతరం ముంబై తొలి ఇన్నింగ్స్ స్కోర్ 62/1గా ఉంది. విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు ముంబై ఇంకా 321 పరుగులు వెనుకపడి ఉంది.

# ‘పుష్ప2’ ఫైనల్ కలెక్షన్స్.. ప్రకటించిన మేకర్స్



పుష్ప2 ఫైనల్ కలెక్షన్స్‌ను మేకర్స్ ప్రకటించారు. గతేడాది డిసెంబర్ 5న విడుదలైన ఈ చిత్రం ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అనేక రికార్డులను రప్పా.. రప్పా.. రప్పా అంటూ దాటుకుంటూ వచ్చేసింది. 75 రోజుల్లో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 1871 కోట్ల (గ్రాస్) వసూలు చేసినట్టు చిత్ర యూనిట్ వెల్లడించింది. 2024లో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన సినిమాగా ‘పుష్ప 2’ నిలవడమే కాకుండా బాలీవుడ్ ఇండస్ట్రీగా నిలిచింది. సినిమా విడుదలైన ఆరు రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి భారతీయ మూవీగా పుష్ప2 రికార్డ్ క్రియేట్ చేసింది. ఇండియన్ సినిమా హిస్టరీలో అత్యధిక వసూలు సాధించిన చిత్రాల జాబితాలో ‘దంగల్’ (రూ.2024 కోట్లు) టాప్‌లో కొనసాగుతుంది. రెండో స్థానంలో ‘పుష్ప2’ (రూ. 1875 కోట్లు), మూడో స్థానంలో బాహుబలి-2 (రూ.1810 కోట్లు) ఉంది. తర్వాతి స్థానాల్లో ఆర్‌ఆర్‌ఆర్ (రూ.1387 కోట్లు), కేజీయఫ్- 2 (రూ.1250 కోట్లు), కల్కి 2898 ఏడీ (రూ.1153 కోట్లు), జవాన్ (రూ.1148 కోట్లు), పఠాన్ (రూ.1050 కోట్లు) వరుసగా ఉన్నాయి. ముఖ్యంగా పుష్ప2 సినిమాకు బాలీవుడ్‌లోనే అత్యధికంగా కలెక్షన్స్ వచ్చాయి. 100 ఏళ్ల బాలీవుడ్ చరిత్రలో పుష్పగాడికి ప్రత్యేక స్థానం దక్కింది. కేవలం హిందీ బెల్ట్‌లోనే రూ. 850 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. అక్కడ త్రీడీ వెర్షన్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. అల్లు అర్జున్ హీరోగా దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా మూవీ ఇండియన్ బాక్సాఫీస్ వద్ద గుర్తుండిపోయే రికార్డ్‌లను నమోదు చేసింది. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో కూడా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో కొనసాగుతుంది. ఓటీటీ కోసం రీలోడెడ్ వర్షన్ పేరుతో అదనం మరో 24 నిమిషాల సీన్లను కలిపారు. దీంతో ఈ మూవీ నిడివి మొత్తం 3 గంటల 40 నిమిషాలుగా ఉంది.



# ఒక్క సినిమాతో లెవెలే మారిపోయింది

గత శుక్రవారం మంచి అంచనాల మధ్య విడుదలైన హిందీ సినిమా.. చావా. లెజెండరీ కింగ్ ఛత్రపతి శివాజీ తనయుడు శంబాజీ మహరాజ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది. ఈ సినిమా ప్రోమోలన్నీ బాగున్నప్పటికీ.. విక్కీ మార్కెట్ స్థాయికి మించి ఖర్చు పెట్టి తీసిన భారీ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఏమాత్రం వర్కవుట్ అవుతుందో అన్న సందేహాలు ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమయ్యాయి. అందులోనూ అన్ సీజన్ అయిన ఫిబ్రవరిలో ‘చావా’ ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో థియేటర్లకు రప్పించగలగా అన్న అనుమానాలూ కలిగాయి. కానీ ‘చావా’ బాక్సాఫీస్ దగ్గర అద్భుతాలు చేస్తోంది. తొలి వారాంతంలో వంద కోట్లకు పైగా వసూళ్లు కొల్లగొట్టింది. బాలీవుడ్లో పెద్ద పెద్ద స్టార్ల సినిమాలకు కూడా ఓపెనింగ్స్ పడిపోతుండగా.. విక్కీ చిత్రానికి తొలి వీకెండ్లో ఏ రోజూ 30 కోట్లకు తక్కువ కాకుండా వసూళ్లు రావడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. సినిమాలో కంటెంట్‌కు తోడు.. విక్కీ స్టార్ పవర్ ఈ సినిమాకు బాగానే కలిసొస్తోంది.గత కొన్నేళ్ల నుంచి మంచి మంచి సినిమాలు, అదిరిపోయే పెర్ఫామెన్సులతో విక్కీ ప్రేక్షకాదరణ పెంచుకుంటూ వస్తున్నాడు. ‘సర్దార్ ఉద్దమ్ సింగ్’, ‘శ్యామ్ బహద్దూర్’ లాంటి చిత్రాల్లో విక్కీ నటనకు హిందీ ఆడియన్స్ ఫిదా అయిపోయారు. ఇప్పుడు ‘చావా’లో శంబాజీ మహరాజ్ పాత్రలో తన స్క్రీన్ ప్రెజెన్స్, యాక్టింగ్ వేరే లెవెల్ అని చెప్పాలి. ‘చావా’ థియేటర్లలో ప్రేక్షకుల భావోద్వేగాలు, స్టాండింగ్ ఒవేషన్లు చూస్తుంటే ఈ సినిమా, విక్కీ పెర్ఫామెన్స్ వారిని ఎంతగా కదిలిస్తున్నాయో అర్థమవుతుంది. విక్కీ పెర్ఫామెన్స్‌కు సంబంధించి కొన్ని వీడియో క్లిప్స్ కూడా సోషల్ మీడియాలో తెగ తిరుగుతున్నాయి. ఇప్పటికే మంచి నటుడిగా గుర్తింపు సంపాదించినప్పటికీ.. శంబాజీ పాత్రలో వీరత్వాన్ని, రౌద్ర రసాన్ని, భావోద్వేగాలను విక్కీ పండించిన తీరు అద్భుతం అనే చెప్పాలి.

# మరో లక్కీ ఛాన్స్ కొట్టేసిన ‘మిస్టర్ బచ్చన్’ భామ



రవితేజ హీరోగా.. హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ‘మిస్టర్ బచ్చన్’ సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడిన భాగ్యశ్రీకి మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. దీంతో ఈ సుందరి టాలీవుడ్‌లో ఆమె వరుస ఆఫర్లతో బిజీగా మారిపోయింది. తాజాగా ఈ భామ మరో క్రేజీ ఆఫర్ కొట్టినట్లు టాక్ వినిపిస్తుంది.కోలీవుడ్ స్టార్ హీరో సూర్య సరసన నటించేందుకు భాగ్యశ్రీకి ఆఫర్ వచ్చినట్లు సమాచారం. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య ఓ సినిమా చేస్తున్నారని ఎప్పటి నుంచో టాక్ నడుస్తోంది. ఈ సినిమా కోసం భాగ్యశ్రీని హీరోయిన్‌గా అడిగినట్లు తెలుస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమాకి జివి ప్రకాశ్ సంగీతం అందించనున్నాడట. ఈ సినిమా ఈ ఏడాది మేలో పట్టాలెక్కనుందని టాక్. ఇక భాగ్యశ్రీ ప్రస్తుతం సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం ‘కాంత’ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాని రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్ఘీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. అంతేకాక.. మహేశ్ దర్శకత్వంలో రామ్ పోతినేని 22 చిత్రంగా తెరకెక్కుతున్న ప్రాజెక్ట్‌లో భాగ్యశ్రీ నటిస్తుంది. విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో వస్తున్న కింగ్‌డమ్ సినిమా కోసం ఈమెను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

# అనుపమకు ‘డ్రాగన్’ బర్త్ డే గిఫ్ట్ అయ్యేనా



మలయాళ చిత్రం ‘ప్రేమమ్’ తో 2015లో చిత్రసీమలోకి అడుగుపెట్టిన అనుపమా పరమేశ్వరన్ ఈ దశాబ్ద కాలంలో దక్షిణాది భాషా చిత్రాలన్నింటిలోనూ నటించి నటిగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. మలయాళ సినిమాల్లో తొలిసారి నటించినా... ఆ తర్వాత సంవత్సరమే ‘అ...ఆ’ తో తెలుగు రంగంలోకి అడుగపెట్టింది. అంతేకాదు... మలయాళంలో ‘ప్రేమమ్’లో చేసిన పాత్రనే తెలుగు రీమేక్ లోనూ చేసింది. ‘అగరొత్తుల కురులే వలగ విసిరేసి’ కుర్రకారు గుండెల్లో సెగలు రేపింది. అదే యేడాది ‘కోడి’ మూవీతో కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది.

దిల్ రాజ్ బ్యానర్ లో రూపుదిద్దుకున్న ‘శతమానం భవతి’ చిత్రం అనుపమా పరమేశ్వరన్ కు మంచి విజయాన్నే కాదు చక్కని పేరూ తెచ్చిపెట్టింది. ఈ సినిమా జాతీయ స్థాయిలో ఉత్తమ వినోదాత్మక చిత్రం అవార్డుతో పాటు రాష్ట్ర స్థాయిలో ఐదు నందీ అవార్డులనూ గెలుచుకుంది. ఆ తర్వాత అనుపమా తెలుగులో చేసిన చిత్రాలేవీ పెద్దంత కమర్షియల్ సక్సెస్ సాధించలేదు. కానీ తమిళ రీమేక్ వచ్చిన ‘రాక్షసుడు’ ఫర్వాలేదనిపించింది. ఇక మూడేళ్ళ క్రితం వచ్చిన ‘రౌడీ బాయ్స్’ నుండి అనుపమా కాస్తంత గ్లామర్ ట్రీట్ ఇవ్వడం మొదలెట్టింది. అప్పటి వరకూ పక్కింటి అమ్మాయిలా కనిపించిన అనుపమా కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్ గా మారిపోయింది. ‘కార్తికేయ -2’లో పద్ధతి గల పాత్ర చేసినా... ‘టిల్లు స్క్వేర్’ లో లిప్ లాక్స్ తో సందడి చేసేసింది. గ్లామర్ పాత్రలకు అనుపమా న్యాయం చేస్తుందని ఆ సినిమా నిరూపించింది. పద్ధతిగల పాత్రల మీదుగా అందాల ఆరబోతకు జండా ఊపేసిన అనుపమా పరమేశ్వరన్ ‘బట్లర్ ఫ్లై’ వంటి లేడీ ఓరియంటెడ్ థ్రిల్లర్ మూవీలోనూ నటించింది. అలానే థాట్ ప్రొవోకింగ్ షార్ట్ ఫిల్మ్ సైతం చేసింది. ఇప్పుడు కూడా తెలుగులో ‘పరదా’ సినిమాలో అర్థవంతమైన పాత్రను పోషించింది. ఇవే కాకుండా ‘బైసన్’, లాక్ డౌన్, పెట్ డిటెక్టివ్, మరీచిక’ వంటి సినిమాలలో అనుపమా నటిస్తోంది. ఫిబ్రవరి 21న రాబోతున్న ‘డ్రాగన్’లో అనుపమా పరమేశ్వరన్... ప్రదీప్ రంగనాథన్ సరసన నటించింది. ఇది కూడా యూత్ ఫుల్ ఎంటర్ టైనరే! ‘లవ్ టుడే’ తో ఇప్పటికే యూత్ ను అట్రాక్స్ చేసిన ప్రదీప్ రంగనాథన్ లేటెస్ట్ మూవీ ‘డ్రాగన్’ కూడా హిట్ అయితే... అది అనుపమకు అభిమానులు ఇచ్చిన బర్త్ డే గిఫ్ట్ అనుకోవచ్చు.

printed by SHIVA PRASAD , published by SHIVA PRASAD and owned by SHIVA PRASAD , printed at Shiva sai graphics offset printers, door no: 8-80, jangon road, anjanapuri colony, suryapet- 508221 TS. published at door no: 5-12, jangon road, anjanapuri colony, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TS-27-0016491